RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్

ప్రజల గొంతుక - నిజం కోసం..

ఆఫ్ ప్రజలు

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | ఆదివారం, జూలై 5, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 72 | పేజీలు: 8 | వెల : రూ.1



ముంబైని ముంచెత్తిన

## భారీ వర్షాలు...

స్కూళ్లు, కాలేజీలకు సెలవు!

# దోపిడి ఆగాలంటే కాంగ్రెస్ రావాలి



మహబూబ్ నగర్ జూలై 4 : తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానానికి అండగా నిలిచిన మిడ్జిల్ గడ్డపై శనివారం భావోద్వేగ ప్రసంగం చేశారు. తాను రాజకీయాల్లోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో ఏర్పాటు చేసిన భారీ కృతజ్ఞత సభ లో సీఎం పాల్గొన్నారు. 2006 జులై 4న మిడ్జిల్ మండల ప్రజలు నన్ను స్వతంత్ర జడ్పీటీసీ అభ్యర్థిగా ఆశీర్వదించారు. నాది ఈ నియోజకవర్గం కాకపోయినా కేవలం నమ్మకంతో గెలిపించారు. ఆరోజు మిడ్జిల్ ప్రజలు నాటిన చిన్న మొక్కే.. ఇవాళ మీ దయవల్ల రాష్ట్ర ముఖ్యమంత్రి అనే మహా వృక్షమైంది అంటూ కృతజ్ఞతలు చాటుకున్నారు. ఇదే వేదికపై తనపై పోటీ చేసి ఓడిపోయిన రబ్బానీని గుర్తుచేసుకుంటూ.. ఆయనకు ప్రభుత్వంలో తగిన బాధ్యత ఇస్తామని, తన వల్ల ఎవరికీ నష్టం జరగకూడదన్నదే తన ఆలోచన అని ఉదారత చాటారు. గతంలో హైదరాబాద్ రాష్ట్రానికి తొలి సీఎంగా చేసిన బూర్గుల రామకృష్ణారావు, కేంద్రమంత్రిగా దేశానికి సేవలందించిన జైపాల్‌రెడ్డి లాంటి మహామహులు ఈ పాలమూరు బిడ్డలేనని రేవంత్ కొనియాడారు. ఈ కృతజ్ఞత సభలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పై సీఎం రేవంత్ రెడ్డి మార్క్ పొలిటికల్ అటాక్‌కు వేదికగా మారింది. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుల అహంకారాన్ని ఎండగడుతూ సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అహంకారానికి, అహంభావానికి కూడా ఒక హద్దు ఉంటుంది. తెలంగాణ కోసం పోరాడిన ప్రజా గాయకుడు గద్దరన్నను ఎర్రటి ఎండలో గడీల ముందు 4 గంటల పాటు నిలబెట్టిన వాడ్ని మనం క్షమించాలా వద్దా అని ప్రశ్నించారు. ఆనాడు గద్దరన్నను అవమానించినందుకు కేసీఆర్‌కు ఉరిశిక్ష వేసినా తక్కువే అంటూ ఉద్వేగానికి లోనయ్యారు. ప్రజాపాలన పోవాలని కాంక్షిస్తున్న కేసీఆర్.. అరుంధతి సినిమాలో పశుపతిని గొలుసులతో బంధించినట్లు ఫామ్‌హౌస్‌లోనే కుంగి కృశించి పోవాలని, తెలంగాణ ప్రజలు ఆయనను అక్కడే బంధించారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. రాజకీయ నాయకులు, అధికారులు మాట్లాడేది వింటే అర్థముంది.. కానీ కన్నబిడ్డలు, ఆడబిడ్డలు తమ ఇంటాయనతో మాట్లాడే వ్యక్తిగత విషయాలను వినేవాడు అసలు మనిషేనా ఆయన అసెంబ్లీకి రాడు కానీ.. మన ఫోన్లు వినడానికి మాత్రం వస్తాడు అంటూ కేసీఆర్ తీరుపై మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేసిన రూ. 8.50 లక్షల కోట్ల అప్పుల లెక్కలపై మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారని,

(మిగతా 2వ పేజీలో)



## కాంగ్రెస్‌లో యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు చిచ్చు

నల్గొండ, జూలై 4, (వాయిస్‌టుడే) : యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన ట్రస్ట్ బోర్డు నియామక వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర దుమారం రేపుతోంది. బుధవారం ప్రభుత్వం ప్రకటించిన ఈ బోర్డు నియామకాలు పార్టీ అంతర్గత విభేదాలను ఒక్కసారిగా రోడ్డుపైకి తెచ్చాయి. ఉమ్మడి నల్గొండ జిల్లా సీనియర్ నేతలను, పార్టీ సొంత క్యాడర్‌ను సంప్రదించకుండా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాలపై గాంధీభవన్‌తో పాటు సోషల్ మీడియా వేదికగా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారం చివరకు న్యూఢిల్లీలోని పార్టీ అధిష్టానానికి అధికారిక ఫిర్యాదుల రూపంలో చేరడం గమనార్హం. ఈ నియామకాలపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏకంగా ఒక టీవీ ఛానల్ లైవ్ లోనే తీవ్ర అసంతృప్తి

(మిగతా 2వ పేజీలో)




## మహారాష్ట్ర రాజకీయాల్లో సంచలనం

### కాంగ్రెస్ లో ఎన్సీపీ విలీనం?

ముంబై, జూలై 4, (వాయిస్ టుడే ) : మహారాష్ట్రలో సంచలనమైన విషయం బయటికి వస్తోంది. మహారాష్ట్ర రాజకీయాలను శాసించిన పార్టీగా ఎన్సీపీకి, దాని అధినేత శరద్ పవార్ కి ఓ పేరుంది. కానీ.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఎన్సీపీని కాంగ్రెస్ లో విలీనం చేయాలని ఆయన నిర్ణయించుకున్నట్లు సమాచారం. దీని వెనుక కాంగ్రెస్ అధిష్ఠానంతో తెరువెనుక చర్చలు కూడా జరుగుతున్నాయని తెలుస్తోంది. ప్రాథమికంగా శరద్ పవార్ కాంగ్రెస్ లో తన పార్టీని విలీనం చేసేందుకు సిద్ధమైనట్లు అంటున్నారు. మహా వికాస్ అగాఢీ లో లుక లుకలు, ప్రస్తుత రాజకీయాల కారణంగా శరద్ పవార్ విసిగిపోయినట్లు తెలుస్తోంది. మహా వికాస్ అగాఢీ అధికారంలో వున్న సమయంలో శరద్ పవార్ ఎంత చెబితే అంతలా రాజకీయాలు నడిచాయి. కానీ.. మహా వికాస్ అగాఢీని, మరీ ముఖ్యంగా ఉద్ధవ్ వర్గంలో చీలిక రావడం, రాజకీయాలు మారిపోవడంతో

(మిగతా 2వ పేజీలో)



## తెలంగాణ త్వరలో దివాళా

కరీంనగర్, జూలై 4 : తెలంగాణను అప్పుల కుప్పగా మార్చడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తేడా లేదు అంటూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పరిధిలో ఈరోజు పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై మండిపడ్డారు. రాష్ట్ర ఖజానాను లూటీ చేస్తూ ఏకంగా రూ. 10 లక్షల కోట్ల మేర అప్పుల భారాన్ని సామాన్యుడి నెత్తిన రుద్దారని దుయ్యబట్టారు. ఈ తరహా బాధ్యతారాహిత్యమైన ధోరణి ఇలాగే కొనసాగితే... భవిష్యత్తులో మన రాష్ట్రం కూడా పాకిస్థాన్, శ్రీలంకల మాదిరి దివాలా తీసే

(మిగతా 2వ పేజీలో)

## సిద్దిపేటకు రేవంత్ రెడ్డి గ్రహణం పట్టింది

### మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



సిద్దిపేట : హరీష్ రావు మాట్లాడుతూ వచ్చేది మన ప్రభుత్వమే సిద్దిపేట అభివృద్ధి వంద కిలోమీటర్ల వేగం తో ప్రగతి పరుగులు పెట్టిస్తా మీ అందరి తలరాత మారాలి అంటే కెసిఆర్ అనే గీత పెట్టుకోవాలి. అ గీత నే మీ భవిష్యత్ మారుస్తుంది సిద్దిపేట లో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఈ సందర్బంగా హరీష్ రావు మాట్లాడుతు. రియల్ ఎస్టేట్ ఒక పెద్ద వ్యాపారం. రియల్ ఎస్టేట్ బాగుంటే దానికి అనుబంధంగా ఎన్నో రంగాలు బాగుంటాయి రియల్ ఎస్టేట్ రంగం బాగా నడిస్తే ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ ఆదాయం పెరుగుతుందని, అలాగే సిమెంట్, స్టీల్, టైల్స్, శానిటరీ, మార్బుల్స్ వంటి అనేక రంగాలకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. వందలాది వ్యాపారాలు సజావుగా సాగుతాయి. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మొత్తం వ్యవస్థ


(మిగతా 2వ పేజీలో)

## సాగర్ చుట్టూ స్కైవాక్



హైదరాబాద్, జూలై 4, (వాయిస్ టుడే ) : హైదరాబాద్ ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. హుస్సేన్‌సాగర్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు దాని చుట్టూ సర్క్యులర్ స్కైవాక్ నిర్మించాలని నిర్ణయించింది. స్కైవాక్ ద్వారా బుద్ధుడి విగ్రహాన్ని కొత్త కోణంలో వీక్షించే అవకాశం కల్పించనుంది. అదే సమయంలో నాగార్జునసాగర్ బుద్ధవనం, ఫణిగిరి, నేలకొండపల్లి వంటి బౌద్ధ క్షేత్రాలను అభివృద్ధి చేసి ప్రత్యేక టూరిజం ప్యాకేజీలు తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. హైదరాబాద్ ప్రజలకు, పర్యాటక ప్రేమికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నగరంలోని హుస్సేన్‌సాగర్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రేవంత్ రెడ్డి సర్కార్ కీలక అడుగు వేస్తోంది. ఇప్పటికే బోటింగ్ సౌకర్యంతో సందర్శకులను ఆకట్టుకుంటున్న హుస్సేన్‌సాగర్‌కు మరింత ప్రత్యేక ఆకర్షణను జోడిస్తూ సరస్సు చుట్టూ ఆధునిక సర్క్యులర్ స్కైవాక్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఈ స్కైవాక్ ద్వారా సందర్శకులు హుస్సేన్‌సాగర్ మధ్యలోని ప్రపంచ ప్రసిద్ధ ఏకశిల బుద్ధ విగ్రహాన్ని సరికొత్త కోణంలో వీక్షించే అవకాశం పొందనున్నారు. సాయంత్ర వేళల్లో సరస్సు అందాలు, నగర వెలుగులు, బుద్ధ విగ్రహం ఒకే వేదికపై కనిపించేలా

(మిగతా 2వ పేజీలో)



## జూలై 20 నుండి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

### చట్టసభల ముందుకు రాజ్యాంగ సవరణ బిల్లులు!

న్యూఢిల్లీ, జూలై 4 : దేశ అత్యున్నత చట్టసభ అయిన భారత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల కు సమయం ఆసన్నమైంది. ఈ ఏడాది వర్షాకాల సమావేశాలను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం పంపిన సిఫార్సులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. ఉభయ సభలను సమావేశపరిచేందుకు ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అధికారికంగా సోషల్ మీడియా వేదికగా స్పష్టత ఇచ్చారు. జూలై 20, 2026 నుండి ప్రారంభం కానున్న ఈ ప్రతిష్టాత్మక సమావేశాలు ఆగస్టు 13, 2026 వరకు నిరంతరాయంగా సాగనున్నాయి. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేస్తూ.. భారత ప్రభుత్వ సిఫార్సుల మేరకు, రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ ఉభయ సభల వర్షాకాల సమావేశాలు-2026 నిర్వహణకు ఆమోదం తెలిపారు. జూలై 20 నుండి ప్రారంభమై ఆగస్టు 13 వరకు ఈ సెషన్స్ కొనసాగుతాయి. జాతీయ ప్రాధాన్యత కలిగిన వివిధ కీలక అంశాలపై, బిల్లులపై చట్టసభల్లో అర్థవంతమైన చర్చలు, సంప్రదింపులు , నిర్ణయాలు జరగడానికి ఈ వేదిక ఉపయోగపడుతుంది అని

(మిగతా 2వ పేజీలో)

## పాలమూరు బ్రహ్మోస్ యూనిట్

### మూడు గ్రామాల్లో భూమి గుర్తింపు




మహబూబ్ నగర్, జూలై 4(వాయిస్ టుడే )రక్షణ రంగ తయారీలో తెలంగాణకు మరో భారీ అవకాశం తలుపు తడుతోంది. ప్రపంచంలోని వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణుల్లో ఒకటైన బ్రహ్మోస్‌కు సంబంధించిన తయారీ కేంద్రాన్ని మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటు చేసే ప్రతిపాదనపై కదలికలు మొదలైనట్లు సమాచారం. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి, జీనుగురాల గ్రామాల సమీపంలో సుమారు 416 ఎకరాల భూమిని గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టుకు తుది అనుమతులు లభిస్తే, ఇది కేవలం పాలమూరు పారిశ్రామిక ముఖచిత్రాన్నే కాకుండా తెలంగాణ రక్షణరంగ వ్యవస్థలో భారీ మార్పులు తెచ్చే పెద్ద పెట్టుబడిగా మారే అవకాశం ఉంది. ఇప్పటివరకు వ్యవసాయం, వలసలు, సాధారణ పరిశ్రమల చర్చలకే పరిమితమైన పాలమూరు ప్రాంతం.. రక్షణ తయారీ రంగంలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే అవకాశాన్ని ఈ ప్రతిపాదన తెచ్చిపెట్టింది. బ్రహ్మోస్ వంటి అత్యంత సున్నితమైన రక్షణ తయారీ ప్రాజెక్టులకు భద్రత, భూమి లభ్యత, రోడ్డు కనెక్టివిటీ, విమానాశ్రయానికి చేరువ, ఇప్పటికే ఉన్న సాంకేతిక పర్యావరణం వంటి అంశాలు కీలకం. దేవరకద్ర ఈ కోణాల్లో అనుకూలంగా ఉందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ప్రతిపాదిత స్థలం జాతీయ రహదారి 44కి సమీపంలో ఉంది. హైదరాబాద్‌ను బెంగళూరుతో కలిపే

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు

ఆదివారం, జూలై 5, 2026

# ఢిల్లీలో రూ.105 కోట్లతో సరికొత్త ఏపీభవన్!

విజయవాడ, జూలై 4, (వాయిస్ టుడే ) : దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిష్టను చాటేలా సరికొత్త ఏపీ భవన్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. విభజన అనంతరం సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ భవన నిర్మాణ ప్రక్రియను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. అక్షరాలా రూ.105 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ నూతన భవనాన్ని నిర్మించనున్నారు. ఢిల్లీకి వచ్చే రాష్ట్ర పౌరులకు, ప్రజాప్రతినిధులకు మరియు అధికారులకు అత్యుత్తమ సేవలు అందించేలా, అన్ని రకాల అత్యాధునిక వసతులతో ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు.ఈ నూతన ఏపీ భవనాన్ని సుమారు 2.5 లక్షల చదరపు అడుగుల భారీ విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ఇది కేవలం ఒక అతిథి గృహంగానే కాకుండా, ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంబంధించిన పూర్తి స్థాయి పరిపాలన మరియు ఆతిథ్య కేంద్రంగా సేవలందించనుంది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన దౌత్యపరమైన సమావేశాలు, పారిశ్రామికవేత్తలతో చర్చలు, మరియు సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకునేలా ఇందులో కాన్ఫరెన్స్ హాళ్లు, వీఐపీ లాంజ్‌లు మరియు ప్రత్యేక కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు.ఈ ప్రతిష్టాత్మక భవన నిర్మాణ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'నేషనల్ బిల్డింగ్స్ కన్స్ట్రక్షన్ కార్పొరేషన్' కి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్పగించింది. ప్రభుత్వ నిర్మాణ రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలతో భవనాలను నిర్మించడంలో ఎన్‌బీసీసీకి మంచి గుర్తింపు ఉంది. ఈ కేంద్ర సంస్థ ఆధ్వర్యంలో ఎలాంటి లోపాలు లేకుండా, నిర్ణీత కాలవ్యవధిలోనే అత్యంత నాణ్యతతో కూడిన హంగులతో ఈ నూతన ఏపీ భవన్ నిర్మాణం పూర్తి కానుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన 12 ఏళ్ల తర్వాత, ఢిల్లీలోని ఏపీ భవన్ ఆస్తుల పంపిణీకి సంబంధించి తెలంగాణ ప్రభుత్వంతో సాగిన సుదీర్ఘ వివాదానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. ఇరు రాష్ట్రాల మధ్య కుదిరిన చారిత్రాత్మక ఒప్పందం ప్రకారం.. ఏపీ వాటాగా వచ్చిన భూమిలోనే ఈ సరికొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు.




## భారత్‌లో మూడో అత్యంత ఖరీదైన హౌసింగ్ మార్కెట్‌గా హైదరాబాద్

**ఇంటి ఈఎంఐలకే ఆదాయంలో 41 శాతం వెచ్చించాల్సిన పరిస్థితి**

**నైట్ ఫ్రాంక్ ఇండియా తాజా అఫర్డబిలిటీ ఇండెక్స్‌లో వెల్లడి**

**ముంబై, ఎన్‌సీఆర్ తర్వాత హైదరాబాద్‌లోనే గృహాలు కాస్ట్‌లీ**

**అహ్మదాబాద్ దేశంలోనే అత్యంత చవకైన గృహ మార్కెట్‌గా గుర్తింపు**



గృహ కొనుగోలుదారులకు హైదరాబాద్ నగరం రోజురోజుకూ ఖరీదైనదిగా మారుతోంది. దేశంలోనే మూడో అత్యంత ఖరీదైన నివాస గృహాల విపణిగా హైదరాబాద్ నిలిచింది. ఇక్కడ ఇల్లు కొనుగోలు చేయాలంటే ఒక సగటు కుటుంబం తమ ఆదాయంలో ఏకంగా 41 శాతాన్ని గృహ రుణ ఈఎంఐలకే కేటాయించాల్సి వస్తోందని ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ 'నైట్ ఫ్రాంక్ ఇండియా' వెల్లడించింది. 2026 ప్రథమార్ధానికి (జనవరి–జూన్) సంబంధించిన 'అఫర్డబిలిటీ ఇండెక్స్' నివేదికను ఆ సంస్థ తాజాగా విడుదల చేసింది. దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ఈ సర్వే నిర్వహించగా, 69 శాతంతో ముంబై అత్యంత ఖరీదైన మార్కెట్‌గా మొదటి స్థానంలో నిలిచింది. 67 శాతంతో జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) రెండో స్థానంలో ఉండగా, వీటి తర్వాత హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది. ఇక అహ్మదాబాద్ 23 శాతంతో అత్యంత అందుబాటు ధరల మార్కెట్‌గా తన స్థానాన్ని పదిలం చేసుకుంది. ఆ తర్వాత స్థానాల్లో కోల్‌కతా (25 శాతం), పుణే (28 శాతం), చెన్నై (29 శాతం), బెంగళూరు (35 శాతం) ఉన్నాయి. 2025 చివరి నాటితో పోలిస్తే హైదరాబాద్‌లో ధరల అందుబాటు విషయంలో పెద్దగా మార్పులు చోటుచేసుకోలేదు. 2022లో ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు ఆర్‌బీఐ రెపో రేటును 250 బేసిస్ పాయింట్లు పెంచడంతో రుణగ్రహీతలపై ఈఎంఐల భారం పెరిగింది. అయితే, 2023 నుంచి ఆర్‌బీఐ వడ్డీ రేట్లను 5.25 శాతం వద్ద స్థిరంగా కొనసాగిస్తుండటంతో ప్రస్తుతం మార్కెట్లలో కొంత స్థిరత్వం కనిపిస్తోంది.

## సిద్దిపేటకు రేవంత్ రెడ్డి గ్రహణం పట్టింది

కుప్పకూలిపోయింది. మీరందరూ ఇంతకుముందు ఎంత ఉత్సాహంగా ఉండేవారు! కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోయిందని, దాని ప్రభావంతో చిన్న వ్యాపారాలు,టీ హోటళ్లు, దుకాణాలు,ఇతర అనుబంధ వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఇది ఒక్క సిద్దిపేట పరిస్థితి కాదు. రాష్ట్రం మొత్తం ఇదే పరిస్థితి. హైదరాబాద్‌లో చూసినా ఇదే, కరీంనగర్‌లో చూసినా ఇదే,నల్గొండలో చూసినా ఇదే, మహబూబ్‌నగర్‌లో చూసినా ఇదే, నిజామాబాద్‌లో చూసినా ఇదే పరిస్థితి. ఎక్కడ చూసినా వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. దుకాణాలు నడవడం లేదు. షాపులకు గిరాకీ లేదు. వ్యాపారం పూర్తిగా దెబ్బతింది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆర్థిక ఇబ్బందులతో వాహనాల ఈఎంఐలు కూడా చెల్లించలేక, ఫైనాన్స్ సంస్థలు వాహనాలు స్వాధీనం చేసుకుంటున్నారు. కుటుంబాలు పిల్లల ఫీజులు చెల్లించలేక, కొందరు పట్టణాలు వదిలి గ్రామాలకు వెళ్లి వ్యవసాయం చేసుకునే పరిస్థితి వచ్చింది అంటే జీవితమే రివర్స్ అయిపోయింది.

## సాగర్ చుట్టూ స్కైవాక్

ఈ ప్రాజెక్టును రూపొందించనున్నట్లు సమాచారం. దీంతో హైదరాబాద్ టూరిజానికి మరో కొత్త గుర్తింపు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.ఇదే సమయంలో నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని కూడా అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. అక్కడ అంతర్జాతీయ బుద్ధ మ్యూజియం, హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. బుద్ధుడి జీవిత ఘట్టాలను ప్రతిబింబించే శిల్పాలు, మహాస్థూపం, ఇతర ఆకర్షణలను మరింత విస్తరించి పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం 274 ఎకరాల్లో విస్తరించిన బుద్ధవనాన్ని మరింత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు.అంతేకాకుండా ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో భారీ మట్టి బౌద్ధ స్తూపం నిర్మించేందుకు కూడా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. అలాగే ఫణిగిరి, బుద్ధవనం, నేలకొండపల్లి, హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ బుద్ధ విగ్రహాన్ని కలుపుతూ ప్రత్యేక బౌద్ధ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.వీకెండ్ టూరిజాన్ని ప్రోత్సహించేలా ఒక రోజు, రెండు రోజుల ప్రత్యేక పర్యాటక ప్యాకేజీలను కూడా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. దేశీయ పర్యాటకులతో పాటు విదేశాల నుంచి వచ్చే బౌద్ధ యాత్రికులను ఆకర్షించేలా ప్రత్యేక బౌద్ధ, జైన టూరిజం సర్క్యూట్లను రూపొందించనుంది. ఈ ప్రాజెక్టులు అమలైతే రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త ఊపు రావడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

## పాలమూరు బ్రహ్మోస్ యూనిట్

ఈ మార్గం దేశంలో అత్యంత ముఖ్యమైన రవాణా కారిడార్లలో ఒకటి. అలాగే శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉండటం కూడా లాజిస్టిక్స్ పరంగా ప్రయోజనకరంగా భావిస్తున్నారు.హైదరాబాద్‌లో రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు సంబంధించిన సంస్థలు ఇప్పటికే బలంగా ఉన్నాయి. ప్రత్యేకించి డీఆర్డీఎల్ పక్కన ఇప్పటికే బ్రహ్మోస్ ఇంటెగ్రేషన్ కాంప్లెక్స్ ఉంది. ఇక్కడ క్షిపణులకు వివిధ వ్యవస్థలతో అనుసంధానించే పని జరుగుతుంది. అదేకాకుండా, ల్యాబ్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, మిధాని, నానా కార్యకలాపాలు, ప్రైవేట్ ఏరోస్పేస్ కంపెనీలు తెలంగాణకు బలమైన పునాది కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు దగ్గరగా, విస్తారమైన భూమి అందుబాటులో ఉండే మహబూబ్‌నగర్‌ను విస్తరణ కేంద్రంగా చూడవచ్చన్న అభిప్రాయం ఉంది.దేవరకద్ర మండలంలోని చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి, జీనుగురాల పరిసరాల్లో భూమిని పరిశీలించినట్లు తెలుస్తోంది. పరిశ్రమల శాఖ స్థాయిలో భూమి గుర్తింపు, ప్రాథమిక సౌకర్యాల పరిశీలన, ప్రాజెక్టు అనుకూలతపై కసరత్తు జరిగినట్లు సమాచారం.భూమి సుమారు 400 నుంచి 416 ఎకరాల మధ్య ఉండొచ్చని చెబుతున్నారు. రక్షణ తయారీ యూనిట్‌కు ప్రధాన ఉత్పత్తి ప్రాంతం మాత్రమే కాకుండా, పరీక్షలు, నిల్వ, భద్రతా వలయం, రవాణా సౌకర్యాలు, అనుబంధ పరిశ్రమల కోసం కూడా విస్తారమైన స్థలం అవసరం అవుతుంది. అందుకే ఇలాంటి ప్రాజెక్టులకు పెద్ద భూప్రాంతం అవసరం అవుతుంది.అయితే ఈ దశలో ప్రాజెక్టు ఇంకా ప్రతిపాదన, స్థల పరిశీలన, అనుమతుల దశలోనే ఉంది. కేంద్ర రక్షణ శాఖ, బ్రహ్మోస్ ఏరోస్పేస్ రాష్ట్ర ప్రభుత్వం స్థాయిల్లో తుది నిర్ణయాలు పూర్తయ్యాకే నిర్మాణంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.బ్రహ్మోస్ యూనిట్ ప్రతిపాదనతో తెలంగాణ రక్షణ తయారీ పటంలో మరింత ప్రాధాన్యం పొందే అవకాశం.బ్రహ్మోస్ అనేది భారత్--రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి వ్యవస్థ. భారత , రష్యాకు చెందిను భాగస్వామ్యంతో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఏర్పడింది. బ్రహ్మపుత్ర, మోస్క్వా నదుల పేర్ల నుంచి 'బ్రహ్మోస్' అనే పేరు వచ్చింది.ఈ క్షిపణిని భూమి, సముద్రం, గగనం, జలాంతర్గామి వేదికల నుంచి ప్రయోగించవచ్చు. వేగం, ఖచ్చితత్వం, వివిధ వేదికల నుంచి ప్రయోగించగల సామర్థ్యం కారణంగా బ్రహ్మోస్ భారత రక్షణ వ్యవస్థలో కీలకమైన ఆయుధంగా గుర్తింపు పొందింది.ఇటీవలి సంవత్సరాల్లో బ్రహ్మోస్ కేవలం భారత సైనిక సామర్థ్యానికే కాకుండా, రక్షణ ఎగుమతులకూ ముఖ్యమైన ఉత్పత్తిగా మారింది. ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ వ్యవస్థల ఎగుమతి ఒప్పందం తర్వాత, ఈ క్షిపణి అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా భారత తయారీ సామర్థ్యానికి ప్రతీకగా నిలిచింది. ప్రస్తుతం యూఏఈ కూడా ఈ వ్యవస్థను కొనుగోలు చేయాలనే ఆసక్తితో ఉందనే వార్తలు వస్తున్నాయి.ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ ఫెసిలిటీఇప్పటికే ప్రారంభమైంది. ఆ యూనిట్‌లో అసెంబ్లీ, ఇంటిగ్రేషన్, టెస్టింగ్ వంటి కీలక ప్రక్రియలు జరుగుతున్నాయి. లక్నో యూనిట్ ప్రారంభం తర్వాత బ్రహ్మోస్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, సరఫరా గొలుసును బలపరచడం, దేశీయ రక్షణ తయారీని విస్తరించడం వంటి అంశాలపై కేంద్రం దృష్టి పెట్టింది. తెలంగాణలో కొత్త యూనిట్‌పై చర్చలు జరగడం సహజమైన పరిణామంగా పరిశ్రమ వర్గాలు చూస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఇప్పటికే ఉన్న రక్షణ, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, మెటీరియల్స్, ప్రెసిషన్ ఇంజినీరింగ్ సామర్థ్యాలు ఈ ప్రతిపాదనకు బలం చేకూరుస్తున్నాయి.ప్రాథమిక అంచనాల ప్రకారం ఈ ప్రాజెక్టుకు ప్రారంభ దశలో సుమారు ?500 కోట్ల పెట్టుబడి రావొచ్చని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. రక్షణ తయారీ యూనిట్‌లు సాధారణ పరిశ్రమల కంటే భిన్నంగా ఉంటాయి. భద్రతా ప్రమాణాలు, నాణ్యత పరీక్షలు, ప్రత్యేక పరికరాలు, అధునాతన తయారీ సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం అవుతాయి.ఈ యూనిట్ ఏర్పడితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,500 నుంచి 2,000 ఉద్యోగాలు రావొచ్చని అంచనా. తయారీ, ఇంజినీరింగ్, నాణ్యత నియంత్రణ, లాజిస్టిక్స్, భద్రత, మెయింటెనెన్స్, పరిపాలన, అనుబంధ సేవల రంగాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడే వీలుంది.దీంతో పాటు చిన్న, మధ్య తరహా అనుబంధ పరిశ్రమలకు కూడా కొత్త అవకాశాలు తెరుచుకోవచ్చు. రక్షణ తయారీ రంగంలో ఒక్క ప్రధాన యూనిట్ వచ్చినా, దానికి సరఫరా చేసే భాగాలు, సామాగ్రి, పరికరాలు, ఎలక్ట్రానిక్స్, ప్యాకేజింగ్, రవాణా వంటి రంగాల్లో స్థానిక వ్యాపారాలకు అవకాశం పెరుగుతుంది.మహబూబ్‌నగర్ జిల్లా చాలా కాలంగా వలసల జిల్లాగా గుర్తింపు పొందింది. సాగునీటి ప్రాజెక్టులు, రోడ్డు కనెక్టివిటీ, హైదరాబాద్‌కు చేరువ, కొత్త పెట్టుబడులతో ఈ ప్రాంతం గత కొన్నేళ్లుగా మార్పు దశలో ఉంది. బ్రహ్మోస్ వంటి హై–టెక్ రక్షణ తయారీ యూనిట్ ఇక్కడికి వస్తే, అది కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదు.. ప్రాంతీయ అభివృద్ధికి కొత్త మలుపు అవుతుంది.దేవరకద్ర పరిసరాల్లో మౌలిక వసతులు మెరుగుపడే అవకాశం ఉంది. రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా, భద్రతా వ్యవస్థలు, కార్మికులకు నివాసాలు, శిక్షణా కేంద్రాలు, విద్యా సంస్థలు, చిన్న వ్యాపారాలు పెరగొచ్చు. హోటళ్లు, రవాణా, రియల్ ఎస్టేట్, సేవా రంగాలకూ దీని ప్రభావం ఉండే అవకాశం ఉంది.

# జూలై 20 నుండి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

పేర్కొన్నారు. దాదాపు నాలుగు వారాల పాటు సాగే ఈ విడత సమావేశాల్లో మొత్తం 19 సిట్టింగ్స్ ఉండేలా కేంద్రం ప్రణాళికలు రచిస్తోంది.ఈ సమావేశాల కంటే ముందే.. జూలై 17న అత్యంత వివాదాస్పదమైన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ తన నివేదికను సమర్పించనుంది. తీవ్రమైన నేరాల్లో అరెస్ట్ అయి 30 రోజులు జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే పీఎం, సీఎంలు పదవుల నుండి ఆటోమేటిక్‌గా తొలగిపోయే క్లాజ్ ఇందులో ఉండటంతో విపక్షాలు దీనిపై రచ్చ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ వర్షాకాల సమావేశాలు మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వానికి, విపక్ష ఇండియా కూటమికి మధ్య తీవ్ర రాజకీయ యుద్ధానికి వేదిక కానున్నాయి. ముఖ్యంగా దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన వన్ నేషన్ – వన్ ఎలక్షన్ బిల్లు ను ఈ సెషన్‌లోనే ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తోంది. దీనితో పాటు, గత సమావేశాల్లో తిరస్కరణకు గురైన మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కూడా ప్రభుత్వం రీ–ఇంట్రడ్యూస్ చేసే అవకాశం ఉంది. మరోవైపు, పార్లమెంట్‌లో మారుతున్న రాజకీయ సమీకరణాలు కూడా ఈ సెషన్‌పై ఆసక్తిని పెంచుతున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ లోని తిరుగుబాటు ఎంపీల విలీనం, శివసేన ఉద్ధవ్ వర్గానికి చెందిన ఎంపీల వ్యవహారాలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ సమావేశాల లోపే కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. తమిళనాడులో డీఎంకే–కాంగ్రెస్ మధ్య మారిన సమీకరణాలతో సభలో సీట్ల కేటాయింపులపై కూడా మార్పులు జరగనున్నాయి. దేశ ఆర్థిక ప్రగతి, రక్షణ రంగ సవాళ్లు, అంతర్గత భద్రతతో పాటు ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరపాలని అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షాలు వ్యూహాలు ప్రతివ్యూహాలు సిద్ధం చేసుకుంటుండటంతో.. రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి.

## కాంగ్రెస్‌లో యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు చిచ్చు

వ్యక్తం చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలను, కీలక నేతలను కనీసం సంప్రదించకుండా ప్రభుత్వం ఈ బోర్డును ఎలా ఖరారు చేస్తుందని ఆయన బహిరంగంగానే తప్పుపట్టారు. ఏళ్ల తరబడి కాంగ్రెస్ జెండా మోసిన ఒరిజినల్ కాంగ్రెస్ నేతలకు ప్రాధాన్యత లేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీలో హాట్ టాపిక్‌గా మారాయి.మరోవైపు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను సైతం ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయలేదనే ప్రచారం జరుగుతోంది. దేవాలయాల వ్యవహారాలతో నేరుగా సంబంధం ఉండే అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కూడా సంప్రదించకుండానే ఈ జాబితాను ఖరారు చేశారని, దేవాదాయ శాఖ మంత్రిని పక్కనబెట్టడం వల్లే ఈ వివాదం మరింత ముదిరిందని కాంగ్రెస్ అంతర్గత వర్గాల్లో గట్టిగా చర్చ నడుస్తోంది. ప్రభుత్వం, పార్టీల మధ్య కనీస సమన్వయం లోపించిందనే దానికి ఈ పరిణామాలే నిదర్శనమని విమర్శకులు అంచనా వేస్తున్నారు.ట్రస్ట్ బోర్డులో వినోద్ వెంకటస్వామిని చేర్చడంపై పార్టీ శ్రేణుల్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే వారి కుటుంబంలో వివేక్ వెంకటస్వామికి కీలక పదవులు ఉండటం, ఆయన కొడుకు ఎంపీగా విజయం సాధించడం గమనార్హం. ఇలాంటి తరుణంలో మళ్లీ అదే కుటుంబానికి చెందిన వినోద్ వెంకటస్వామికి పవిత్రమైన యాదగిరిగుట్ట బోర్డులో స్థానం కల్పించడం ఏంటని, పార్టీ కోసం రక్తం చిందించిన ఇతర సీనియర్లను ఎందుకు విస్మరించారని కొందరు నేతలు ప్రశ్నిస్తున్నారు.అన్నింటికంటే ముఖ్యంగా, మాజీ బీఆర్ఎస్ ఎంపీ సోదరుడైన సత్యనారాయణ రెడ్డిని ఈ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా నియమించడంపై కాంగ్రెస్ పాతకాపులు భగ్గుమంటున్నారు. దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడిన నాయకులను పక్కనబెట్టి, నిన్నగాక మొన్న పార్టీ మారిన వారికి, బీఆర్ఎస్ నేపథ్యం ఉన్నవారికి ఇలాంటి ఉన్నతమైన, ప్రతిష్టాత్మకమైన పదవులు కట్టబెట్టడం ఏంటనే ఆవేదన పార్టీ క్యాడర్‌లో వ్యక్తమవుతోంది.మరోవైపు ప్రముఖ నటుడు చిరంజీవి భార్య కొణిదెల సురేఖను బోర్డు మెంబర్‌గా నియమించడం రాజకీయంగా సరికొత్త వివాదానికి దారితీసింది. ఆంధ్రప్రదేశ్‌తో బలమైన మూలాలు, సంబంధాలు ఉన్న ఆమెను తెలంగాణలోని అత్యంత పవిత్రమైన, ప్రతిష్టాత్మకమైన ఆలయ బోర్డులో ఎలా నియమిస్తారంటూ సోషల్ మీడియా వేదికగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికతను, తెలంగాణ సెంటిమెంట్‌ను దెబ్బతీసేలా ఈ నిర్ణయం ఉందంటూ కొందరు నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్షాలకు ఆయుధంగా మారేలా ఈ నియామకం ఉందనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.మొత్తంగా చూస్తే, యాదగిరిగుట్ట ఆలయ బోర్డు నియామకాల వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్‌లో పెద్ద చిచ్చే పెట్టింది. అసంతృప్త నేతలకు పార్టీ అధిష్టానం సీరియస్‌గా తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలుస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో రేగిన మంటలు చల్లారేలా కనిపించడం లేదు. మరి ఈ అంతర్గత సంక్షోభాన్ని ప్రభుత్వం, పార్టీ పెద్దలు ఎలా సర్దుబాటు చేస్తారో వేచి చూడాలి.

## దోపిడి ఆగాలంటే కాంగ్రెస్ రావాలి

దానికి సమాధానం చెప్పే దమ్ము గులాబీ నేతలకు ఉందా అని రేవంత్ నిలదీశారు. తెలంగాణలో పేదలకు ఇళ్లు ఇవ్వకుండా, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటూ ప్రశ్నాపత్రాలను పల్లీబఠాణిల్లా అమ్ముకున్న పాపం బీఆర్ఎస్‌దేనని విమర్శించారు. దొరల దురహంకారాన్ని పాలమూరు గడ్డపై మరోసారి బొంద పెట్టాల్సిన అవసరం ఉందని కేడర్‌కు పిలుపునిచ్చారు. వందేళ్లుగా దేశంలో ఎక్కడా జరగని 'కులగణన'ను తమ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో చేపట్టి దేశానికే దిక్సూచిగా నిలిచిందని సీఎం గర్వంగా ప్రకటించారు. ఈ పర్యటనలో భాగంగా మిడ్జిల్ మండలంలో రూ.10 కోట్లతో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ మండలాన్ని ప్రత్యేకంగా దత్తత తీసుకోవాలని భట్టిని కోరారు. తాము అధికారంలోకి వచ్చితర్వాత గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తూ, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ నిజమైన ప్రజాపాలన అందిస్తున్నామని స్పష్టం చేశారు. కేసీఆర్ కుటుంబానికి గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలంతా ఆలోచించాలని.. మళ్లీ వారి దోపిడీ రాజ్యం రాకుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని సీఎం రేవంత్ రెడ్డి మిడ్జిల్ సభ ముఖంగా పిలుపునిచ్చారు.

## మహారాష్ట్ర రాజకీయాల్లో సంచలనం

శరద్ పవార్ ఈ నిర్ణయానికి వచ్చారు.ఒకవేళ ఈ విలీనం జరిగితే మాత్రం మహారాష్ట్ర రాజకీయ ముఖచిత్రమే మారిపోతుంది. మహారాష్ట్ర రాజకీయాలకు పెద్ద దిక్కుగా వున్న శరద్ పవార్ ఇక రాజకీయాల నుంచి తప్పుకున్నట్లే లెక్క. అజిత్ పవార్ దివంగతులయ్యారు. ఉద్ధవ్ తిరుగుబాటుతో సతమతమవుతున్నారు.అయితే.. ఈ విలీన ప్రతిపాదన పూర్తిగా రాష్ట్ర స్థాయిలోనే చర్చలు జరపాలని నిర్ణయించారు. ఎన్సీపీలో ఏకాభిప్రాయం తర్వాతే ఢిల్లీలో విలీనం పూర్తి చేయాలని నిర్ణయించారు. దీని ద్వారా కాంగ్రెస్ ను కూడా బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. శరద్ పవార్ సాయంతో కాంగ్రెస్ ను దీటుగా తయారు చేయాలని అనుకుంటున్నారు.

## తెలంగాణ త్వరలో దివాళా

దుస్థితికి చేరుకుంటుందని హెచ్చరించారు. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కి ప్రగతిపథంలో పయనించాలంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో కొనసాగుతున్న ప్రతి చిన్న అభివృద్ధి వెనుక మోదీ సర్కార్ పంపిన నిధులే ఉన్నాయని గుర్తుచేశారు.పల్లెల ప్రగతి కోసం ఢిల్లీ నుంచి నేరుగా వస్తున్న ఆర్థిక సంఘం నిధులను సైతం ఇక్కడి పాలకులు జీతాల చెల్లింపుల కోసం దారిమళ్లిస్తున్నారని సంజయ్ ఆరోపించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ప్రజాహిత పథకాలపై కోర్టులకెళ్లడం ఏంటని ప్రశ్నించిన ఆయన... వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పించి శాశ్వత సంపదను సృష్టిస్తుంటే... దానిపై కూడా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీకి దక్కుతున్న ఆదరణను తట్టుకోలేకనే ప్రతిపక్షాలు ఈర్ష్యతో ఇటువంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నాయని, కానీ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు.

### ముంబైని ముంచెత్తిన భారీ వర్షాలు... స్కూళ్లు, కాలేజీలకు సెలవు!

భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ముంబై నగరానికి రెడ్ అలర్ట్ జారీ చేయడంతో బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అప్రమత్తమైంది. నగరంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో, విద్యార్థుల భద్రతను పరిగణనలోకి తీసుకుని శనివారం మధ్యాహ్నం నుంచి అన్ని పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దని బీఎంసీ విజ్ఞప్తి చేసింది. కాగా, ఈ వారం ప్రారంభం నుంచే ముంబై నగరాన్ని వానలు ముంచెత్తుతున్నాయి. గత 24 గంటల్లో నగరంలోని పలు ప్రాంతాల్లో గరిష్టంగా 100 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ముంబైతో పాటు థానే, పాల్ఘర్, రాయగఢ్ జిల్లాల్లో జులై 4 నుంచి 6 వరకు ఈ రెడ్ అలర్ట్ అమల్లో ఉంటుందని ఐఎండీ స్పష్టం చేసింది. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తూ, అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ క్రమంలోనే థానే జిల్లాతో పాటు కల్యాణ్–డోంబివిలి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విద్యాసంస్థలకు కూడా సెలవు ప్రకటించారు.

ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల ధాటికి ముంబైలో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. పలు లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు ప్రధాన రహదారులపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సబర్బన్ లోకల్ రైళ్ల రాకపోకలకు సైతం తీవ్ర అంతరాయం కలిగింది. అంధేరి ఈస్ట్ సబ్‌వే వంటి ప్రాంతాల్లో చేరిన వర్షపు నీటిని తొలగించేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన డీవాటరింగ్ పంపులను ఏర్పాటు చేసి చర్యలు చేపట్టారు.

# టీబీ,అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**ముందస్తు వ్యాధి నిర్ధారణతో ప్రాణాలను కాపాడుకోవచ్చు**

**టీబీ రోగులకు నిక్షయ్ పోషణ్ యోజన ద్వారా నెలకు రూ.1,000 ఆర్థిక సాయం**

**టీబీ--ఎన్‌సీడీ స్క్రీనింగ్ శిబిరాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్**



హనుమకొండ జిల్లా,వాయిస్ టుడే: ఆరోగ్యపరంగా అధిక ప్రమాదం ఉన్న వర్గాల కోసం వైద్య ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న క్షయవ్యాధి (టీబీ),అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) స్క్రీనింగ్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు. శనివారం హసన్‌పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని భీమారం పాత గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన టీబీ,ఎన్‌సీడీ స్క్రీనింగ్ శిబిరాన్ని కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లు,పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మదన్ మోహన్ రావు శిబిరం నిర్వహణ,అందిస్తున్న సేవలపై కలెక్టర్‌కు వివరించారు. 30 సంవత్సరాలు పైబడిన వారికి రక్తపోటు,మధుమేహం,నోటి క్యాన్సర్,రొమ్ము క్యాన్సర్,గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లకు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 60 సంవత్సరాలు పైబడిన వారు,మధుమేహ వ్యాధిగ్రస్తులు,గతంలో టీబీ చికిత్స పొందిన వారు,వారి కుటుంబ సభ్యులు,పోషకాహార లోపంతో బాధపడుతున్న వారు,ధూమపానం చేసే వారు,రెండు వారాలకు పైగా దగ్గు,జ్వరం వంటి లక్షణాలతో బాధపడుతున్న వారికి మొబైల్ డిజిటల్ ఎక్స్‌రే ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. క్షయవ్యాధిని ముందుగానే గుర్తించి సకాలంలో చికిత్స ప్రారంభించడం, పోషకాహారం తీసుకోవడం ద్వారా పూర్తిగా నయం చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. శిబిరానికి వచ్చిన ప్రజలతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. స్క్రీనింగ్ పరీక్షలు,మొబైల్ ఎక్స్‌రే సేవలు,నిక్షయ్ పోర్టల్,ఎన్‌సీడీ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా జరుగుతున్న నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం టీబీ చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ అభియాన్ లక్ష్యం దేశంలో క్షయవ్యాధి నిర్మూలనేనని తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం అత్యాధునిక, ఖరీదైన చికిత్సను పూర్తిగా ఉచితంగా అందిస్తోందని చెప్పారు. టీబీ రోగులకు చికిత్స కాలంలో నిక్షయ్ పోషణ్ యోజన ద్వారా ప్రతి నెల రూ.1,000 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. క్షయవ్యాధిపై ఎలాంటి అపోహలకు లోనుకాకుండా రెండు వారాలకు పైగా దగ్గు,జ్వరం,బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని,ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్,ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్ మోహన్ రావు,డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రదీప్ రెడ్డి,హసన్‌పర్తి తహసీల్దార్ కిరణ్ కుమార్,వైద్యాధికారులు డాక్టర్ భరత్,డాక్టర్ మానస,జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్ రెడ్డి,టీబీ యూనిట్ సిబ్బంది,వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# దొడ్డి కొంరయ్య స్ఫూర్తితో దోపిడి వ్యవస్థను కూల్చాలి

తొర్రూరు, జులై 4 వాయిస్ టుడే : మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ప్రాణ త్యాగం స్ఫూర్తితో ఈ దోపిడి వ్యవస్థ పై పోరాడాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి, తొర్రూర్ డివిజనల్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న పిలుపునిచ్చారు. దొడ్డి కొమరయ్య 80 వ వర్ధంతి సందర్భంగా శనివారం తొర్రూర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆయన చిత్రపటానికి పూలు చల్లి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణలో కొనసాగిన భూస్వామ్య దోపిడీ అణచివేత వెట్టిచాకిరుకి వ్యతిరేకంగా సాగిన మహత్తర రైతాంగ సాయుధ పోరాటంలో 3వేల మంది అమరులైనారని అన్నారు. 1946 జూలై 4న కడివెండిలో భూస్వాముల గుండాలు జరిపిన దాడిలో కొమురయ్య వీరమరణం పొందాడని అన్నారు.ప్రజల వేల గ్రామాలలో స్వరాజ్యాలను స్థాపించుకొని పది లక్షల ఎకరాల భూమికి హక్కు దారులుగా మారారని అన్నారు. నాటి పోరాట స్ఫూర్తితో నేడు దేశంలో కొనసాగుతున్న నిరుద్యోగం, పేదరికం, ఆకలి చావులు వలసలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కలిసి ఉంటున్న హిందూ ముస్లిం క్రిస్టియన్ మతాల మధ్య కొట్లాటలు పెట్టించి అధికారాన్ని సుస్థిరం చేసుకోవటానికి జరుగుతున్న కుట్రలను అర్థం చేసుకోవాలని అన్నారు. పెరిగిన పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరల భారం కోట్లాదిమంది ప్రజలను మరింత పేదరికంలోకి మార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవినీతి అక్రమాలు బంధుప్రీతి రాజ్యమేలుతున్నాయని అన్నారు. కేంద్రంలోని బిజెపి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను మభ్యపరుస్తూ ఇచ్చిన హామీలను అమలు చేయడం



లేదని విమర్శించారు. పాలకులు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం ప్రజలంతా చైతన్యవంతమై పోరాడాలని, నూతన ప్రజాస్వామ్య విప్లవం విజయవంతమైనప్పుడే దొడ్డి కొమురయ్యకు నిజమైన నివాళులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బైరు శ్రీను ధర్మయ్య,పుల్లయ్య, కనుకు,ఎల్లయ్య కుమార్,లక్ష్మయ్య, సంతోష్ , సాయిలు, వెంకన్న, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు కామ్రేడ్ దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి ఘన నివాళులు

**బందు మహేందర్ మండల కార్యదర్శి**



తొర్రూరు, జులై 4 వాయిస్ టుడే : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు కామ్రేడ్ దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి సందర్భంగా తొర్రూర్ పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి బంధు మహేందర్ సిపిఐ తొర్రూర్ మండల కార్యదర్శి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బందు మహేందర్ మాట్లాడుతూ నిజాం పాలనలో భూస్వాముల దౌర్జన్యాలు, వెట్టిచాకిరి, అక్రమ వసూళ్లు, సామాన్య ప్రజలపై జరుగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యవంతం చేస్తూ ఉద్యమాలు నిర్వహించాయని తెలిపారు. విసునూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి, ఆయన తల్లి జానకమ్మ సాగించిన దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కడవెండి గ్రామంలో నిర్వహించిన ర్యాలీపై విసునూరు రామచంద్రారెడ్డి ప్రవేట్ సైన్యం, రజాకార్లు జరిపిన కాల్పుల్లో 1946 జూలై 4న కామ్రేడ్ దొడ్డి కొమరయ్య అమరుడయ్యారని పేర్కొన్నారు. దొడ్డి కొమరయ్య త్యాగం తెలంగాణ రైతాంగ పోరాటాన్ని మరింత ఉధృతం చేసి వేలాది మంది రైతులు, కూలీలను ఉద్యమంలోకి తీసుకువచ్చిందన్నారు. ఆయన త్యాగం ప్రజా విముక్తి కోసం పోరాడే ప్రతి ఒక్కరికీ శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తుందని, నేటి పాలకులు ప్రజల హక్కులను కాలరాస్తున్న నేపథ్యంలో దొడ్డి కొమరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని అన్నారు. హైదరాబాద్ రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో భూస్వామ్య వ్యవస్థకు, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. దొడ్డి కొమరయ్య చూపిన త్యాగం, ధైర్యసాహసాలు నేటి యువతకు ఆదర్శమని, సామాజిక న్యాయం, సమానత్వం, లౌకిక ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం యువత పోరాట స్ఫూర్తితో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రైతులు, కార్మికులు, పేద ప్రజల హక్కుల కోసం కమ్యూనిస్టు ఉద్యమం నిరంతరం పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తొర్రూర్ మండల సహాయ కార్యదర్శి గణపురం లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, సూరబోయిన వీరన్న, ఎడమ కుమారస్వామి, రాసాల శ్రీశైలం, కాసాని వెంకన్న, ఎన్ సూరి, బొమ్మన బోయిన సంపత్, బొమ్మన బోయినయాకయ్య, సముద్రాల రాజు, బానోత్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అండగా నిలిచిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**టీసీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు తక్షణ సహాయం**

**విద్యాసంవత్సరం వృథా కాకుండా అడ్మిషన్ కల్పించాలని ఎంపీ విజ్ఞప్తి**

హనుమకొండ,వాయిస్ టుడే: విద్యార్థుల భవిష్యత్తు విషయంలో ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపే వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మరోసారి తన స్పందనతో విద్యార్థులకు అండగా నిలిచారు. వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో నిర్వహించిన స్పాట్ కౌన్సిలింగ్ సందర్భంగా ఒరిజినల్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (టీసీ) లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఆమె కీలక సహాయం అందించారు. రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌లో చదివిన మంచిర్యాల జిల్లాకు చెందిన డి. ఆశిత్‌తో పాటు మరో విద్యార్థి టీసీ ఆలస్యంతో స్పాట్ అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనలేని పరిస్థితి ఏర్పడింది. అవసరమైన ఒరిజినల్ పత్రాలు లేకపోవడంతో కళాశాల యాజమాన్యం అడ్మిషన్ ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్యను విద్యార్థులు సంప్రదించి తమ సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన ఎంపీ కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు సంబంధిత అధికారులతో స్వయంగా మాట్లాడి ఒరిజినల్ టీసీ సమర్పణకు కొంత గడువు ఇవ్వాలని,చిన్నపాటి ఆలస్యంతో విద్యార్థుల విద్యాసంవత్సరం వృథా కాకుండా స్పాట్ అడ్మిషన్‌లో వారికి అవకాశం కల్పించాలని కోరారు. ఎంపీ విజ్ఞప్తిపై అధికారులు



సానుకూలంగా స్పందించి విద్యార్థులకు తాత్కాలిక అవకాశం కల్పిస్తూ సీట్లు కేటాయించేలా చర్యలు చేపట్టారు. దీంతో అడ్మిషన్ కోల్పోయే పరిస్థితిలో ఉన్న విద్యార్థులకు పెద్ద ఊరట లభించింది. ఈ సందర్భంగా విద్యార్థులు,వారి తల్లిదండ్రులు,విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సమయానికి స్పందించి తమ విద్య కొనసాగేందుకు సహకరించారని వారు పేర్కొన్నారు. విద్య,ఉపాధి,యువత సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి సమస్యపై వెంటనే స్పందిస్తున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మరోసారి విద్యార్థులకు అండగా నిలుస్తూ తన సేవాభావాన్ని చాటుకున్నారు.



## బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మండల ప్రత్యేక అధికారి

: 04-07-2026 వాయిస్ టుడే మహబూబాబాద్) జిల్లా కలెక్టర్ మరియు అడ్మినిస్ట్రేటివ్ అధికారి శ్రీమతి. స్నేహ శబరిష్ ×.ూ.ా. గారి ఆదేశాల ప్రకారం తేదీ.04.07.2026 శనివారం జిల్లా ఉద్యానవన శాఖ మరియు పట్టు పరిశ్రమల శాఖ అధికారి మరియు నెల్లికుదురు మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న మండల కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల(రాజ)బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు అనంతరం విద్యార్థులతో మాట్లాడి అక్కడి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి భోజనం,సురక్షిత మంచి నీరు అందించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ వర్షాకాలంలో బయట నుండి పాములు తేళ్లు విషపూరిత క్రిమి కీటకాలు రాకుండా చూసుకోవాలని హాస్టల్ సంక్షేమ అధికారికి సూచించారు. వసతి గృహంలో పరిశుభ్రత పాటించాలని హాస్టల్లో ఫ్యాన్లు సరిగా పనిచేసేలా చూసుకోవాలని స్టడీ అవర్స్ కోసం రాత్రిపూట లైటింగ్ వసతి కల్పించాలని పడుకోవడానికి బెడ్స్ సరిగా ఉన్నాయా లేవా తెలుసుకోవాలని దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, మెనూ ప్రకారం భోజన వసతి కల్పించాలని తెలిపిపారు. ప్రభుత్వ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల ప్రకారం వసతి గృహాన్ని నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సంక్షేమ అధికారి సతీష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేపించిన కాంగ్రెస్ నాయకులు

వరంగల్ ( వాయిస్ టుడే ) జూలై 04 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశలు వేగంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి కొండా సురేఖ ప్రత్యేక ఆశీస్సులతో ఒక పేదింటికల నెరవేరింది.. గృహప్రవేశ కార్యక్రమన్ని కాంగ్రెస్ నాయకుల సమక్షంలో శనివారం పేదింటి దంపతులు సంతోషల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంటిస్టేడ్ కార్పొరేటర్ బెడద వీరన్న మాజీ డివిజన్ అధ్యక్షులు బోయిని దూడయ్య యాదవ్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంగారబోయిన చందర్ 37వ డివిజన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సిరబోయిన కిరణ్, కిషన్ సేల్ మండల అధ్యక్షులు ఎసిరెడ్డి ప్రభాకర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు భోగి సురేష్ ఎండి ముక్కబీర్ ఇట్నేని ప్రతాప్, మరియు తదితరులు పాల్గొన్నారు



## నూతన పోలీస్ కమిషనర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ ప్రతినిధులు

**పూలమొక్కప్రత్యేక మెమెంటో అందజేసి శుభాకాంక్షలు**

**రెడ్ క్రాస్ కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తాం: సీపీ**

హనుమకొండ, వాయిస్ టుడే: నూతనంగా వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్వేతను హనుమకొండలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా శాఖ రాష్ట్ర పాలక మండలి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్‌కు పూలమొక్కతో పాటు రెడ్ క్రాస్ సొసైటీ యొక్క ఏడు ప్రాథమిక సూత్రాలను ప్రతిబింబించే ప్రత్యేక మెమెంటోను అందజేశారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు,భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు,సామాజిక సేవా కార్యక్రమాల విస్తరణ,రక్తదాన కార్యక్రమాలు మరియు విపత్తుల సమయంలో చేపట్టే సహాయక చర్యల గురించి సభ్యులు పోలీస్ కమిషనర్‌కు వివరించారు. అలాగే హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయాన్ని సందర్శించవలసిందిగా ఆహ్వానించారు. దీనికి స్పందించిన పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత త్వరలో రెడ్ క్రాస్ సొసైటీని సందర్శిస్తానని,రెడ్ క్రాస్ చేపట్టే సేవా కార్యక్రమాలకు,ముఖ్యంగా రక్తదాన కార్యక్రమాలు మరియు సామాజిక సేవా కార్యక్రమాలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి,వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్,కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి,రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు,జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్,డాక్టర్ మాగంటి శేషుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# వంగవీటి మోహన్ రంగ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన మున్నూరు కాపు సంఘం

## ఏన్కూర్‌లో విగ్రహానికి పూలమాలలు కేక్ కటింగ్.. వృద్ధులకు పండ్ల పంపిణీ రంగ ఆశయాలను స్మరించిన నాయకులు





వాయిస్ టుడే/వైరా ప్రతినిధి: ప్రజా నాయకుడు, వెనుకబడిన వర్గాల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడిన దివంగత వంగవీటి మోహన్ రంగ జయంతి వేడుకలను ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఏన్కూర్ ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్ రంగ విగ్రహానికి సంఘం నాయకులు, సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకోవడంతో పాటు వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన మున్నూరు కాపు సంఘం నాయకులు, పెద్దలు, యువకులు వంగవీటి మోహన్ రంగ చిత్రపటానికి, విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయన జీవిత విశేషాలను స్మరించుకున్నారు. సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రంగ చేసిన కృషి, ప్రజా సమస్యలపై ఆయన చూపిన చిత్తశుద్ధి, నిస్వార్థ సేవలను గుర్తు చేసుకున్నారు. నేటి యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కొవ్వూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ, వంగవీటి మోహన్ రంగ ఒక వ్యక్తి మాత్రమే కాదు, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక. సమాజంలో న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకం. యువత ఆయన సేవా స్ఫూర్తిని కొనసాగించాలి అని అన్నారు. గౌరవ అధ్యక్షుడు ఆవుల నర్సయ్య మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేసిన నాయకుడు వంగవీటి మోహన్ రంగ. ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ ప్రతి సంవత్సరం జయంతి వేడుకలను నిర్వహిస్తున్నాం అని తెలిపారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి వారి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాల పట్ల యువతలో అవగాహన పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొవ్వూరు నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు ఆవుల నర్సయ్య, ఉపాధ్యక్షుడు గిద్దగిరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఆది నర్సింహారావు, కోశాధికారి ముదిగొండ నాగేశ్వరరావు, ప్రచార కార్యదర్శి పొట్లపల్లి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు మారేపల్లి నరేంద్ర బాబు, మున్నూరు కాపు పెద్దలు వారణాసి సీతారామయ్య, కంభంపాటి రంగారావు, నిమ్మల నరేంద్ర, ముదిగొండ పుల్లయ్య, యూత్ నాయకులు నిమ్మల నాగేశ్వరరావు, ఆది రవితేజతో పాటు సంఘ సభ్యులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల విద్యాభ్యాసానికి చేయూత.. సొంత ఖర్చుతో 10 సైకిళ్లు పంపిణీ చేసిన హెచ్ఎం

## రూ.60 వేల వ్యయంతో కొనుగోలు.. ఏన్కూరు మండలం నాచారం పాఠశాల విద్యార్థులకు అందజేత





వాయిస్ టుడే/వైరా ప్రతినిధి : విద్యార్థుల విద్యాభ్యాసానికి దూరం అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ఏన్కూరు మండలం నాచారం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నల్లపు రామకృష్ణ అభినందనీయ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాలకు దూర ప్రాంతాల నుంచి కాలినడకన వస్తూ ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల కోసం సొంత నిధులతో రూ.60 వేల వ్యయంతో 10 సైకిళ్లను కొనుగోలు చేసి శనివారం పంపిణీ చేశారు. ఈ సైకిళ్లను మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) ఎన్. వాసవి దేవి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. నాచారం గ్రామంతో పాటు గంగుల నాచారం, కాలనీ నాచారం, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం పరిసర ప్రాంతాల నుంచి పలువురు విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు కాలినడకన వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బాలికలు మరియు చిన్నారులు దూర ప్రయాణం కారణంగా సమయానికి పాఠశాలకు చేరుకోవడంలో ఇబ్బందులు పడుతున్నట్లు ఉపాధ్యాయులు గుర్తించారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రధానోపాధ్యాయుడు నల్లపు రామకృష్ణ స్వచ్ఛందంగా ముందుకొచ్చి సొంత డబ్బులతో సైకిళ్లను కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేయడం విశేషం.. ఈ సందర్భంగా ఎంఈఓ ఎన్. వాసవి దేవి మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం వ్యక్తిగతంగా ముందుకొచ్చి సొంత నిధులతో సైకిళ్లు అందించడం ఎంతో ఆదర్శప్రాయమైన చర్య. ప్రధానోపాధ్యాయుడు నల్లపు రామకృష్ణతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థుల పట్ల చూపుతున్న నిబద్ధత ప్రశంసనీయం అని అన్నారు. ప్రధానోపాధ్యాయుడు నల్లపు రామకృష్ణ మాట్లాడుతూ,.దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు చదువుపై మరింత దృష్టి సారించేందుకు, వారి రాకపోకల ఇబ్బందులు తగ్గించేందుకు ఈ సైకిళ్లను అందజేశాం. విద్యార్థుల సంక్షేమం కోసం భవిష్యత్తులోనూ ఇటువంటి కార్యక్రమాలు కొనసాగిస్తాం.అని తెలిపారు. సైకిళ్లు అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీటిటీఎఫ్ మండల అధ్యక్షుడు హతిరాం, విద్యా కమిటీ చైర్మన్ డి. లక్ష్మి, ఉపాధ్యాయులు లలిత, ప్రసాద్, నరసింహారావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

**ఆవిర్భావ దినోత్సవాన్ని పండగలా జరుపుకోవాలి**

**ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ శ్రేణులకు మండల నాయకత్వం పిలుపు**

**జూలై 7న మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు**

**ఎంఎస్పి మండల అధ్యక్షుడు పడిశాల నాగేశ్వరరావు మాదిగ**

ముదిగొండ మండలం జూలై 4 వాయిస్ టుడే : ముదిగొండ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఆధ్వర్యంలో జూన్ 7 ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జరగబోయే కార్యక్రమాలను వివరిస్తూ ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి శ్రేణులు ఎమ్మార్పీఎస్ జెండాలతో మానవహారం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఎం ఎస్ పి ముదిగొండ మండల అధ్యక్షుడు పడిశాల నాగేశ్వరరావు మాట్లాడుతూ జూన్ 7న జరగబోయే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో ఉన్న ప్రతి గ్రామములో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేయాలని అదే రోజున ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు జరపాలని ప్రతి ఎం ఎస్ పి ఎమ్మార్పీఎస్ కార్యకర్త ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు గూడూరు వీరస్వామి మాదిగ,కొలిక పొంగు వెంకటరావు మాదిగ,ఎం ఎస్ పి మండల అధ్యక్షుడు పడిశాల నాగేశ్వరరావు మాదిగ,ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొడ్డు అనిల్ మాదిగ, విహెచ్పిఎస్ మండల అధ్యక్షుడు గుంజులూరి రాంబాబు మాదిగ, మేడేపల్లి గ్రామ అధ్యక్షుడు బొడ్డు శ్రీను మాదిగ, కట్టకూరి రాంప్రసాద్ మాదిగ, ఎస్ కే సైదా పాషా తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్‌పై ప్రతి ఓటరికి అవగాహన కల్పించడమే లక్ష్యం

**జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పట్లోళ్ల నర్సింహారెడ్డి**

వాయిస్ టుడే ఝరాసంగం జూలై 04 : ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రతి ఓటరికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడమే లక్ష్యమని జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పట్లోళ్ల నర్సింహారెడ్డి అన్నారు. శనివారం జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రతి ఓటరుకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశమని తెలిపారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి అర్హత కలిగిన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదై ఉండేలా, అవసరమైన సవరణలు చేసుకునేలా పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై అపోహలు, సందేహాలకు తావు లేకుండా ప్రజలకు సరైన సమాచారం చేరవేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీలపై ఉందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఓటరికి ఈ ప్రక్రియ గురించి వివరించి అవగాహన కల్పించేందుకు తాము పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన సమాచారం, మార్గదర్శకాలు, అవసరమైన సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఓటర్లకు ఏవైనా సందేహాలు ఉంటే విధుల్లో ఉన్న సిబ్బంది వెంటనే నివృత్తి చేసి అవసరమైన సహకారం అందిస్తారని పేర్కొన్నారు. ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీడీసీ డైరెక్టర్ మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ తుక్కారం, సీనియర్ నాయకులు నర్సింహులు, బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సొంతింటి కల సహకారం తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్



తొర్రూరు, జులై 4 వాయిస్ టుడే : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోని నిరుపేదలకు సొంతింటి కల సహకారం అవుతుందని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం తొర్రూరు పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు సొంత ఇంటి కలను సాకారం చేసుకోవడం ఎంతో ఆనందదాయకమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. కొత్త ఇంటిలో అడుగుపెట్టిన కుటుంబాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, హౌసింగ్ ఏఈ యామిని,బసన బోయిన రాజేష్, రాజు,పార్టీ నాయకులు, లబ్ధిదారులు,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



## దొడ్డి కొమురయ్య ఆశయాలు నేటి తరానికి ఆదర్శం.. ::: హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

హనుమకొండ,వాయిస్ టుడే: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం,ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెట్టిచాకిరీ,సామాజిక దోపిడీ,నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన దొడ్డి కొమురయ్య తెలంగాణ ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం,న్యాయం,ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన త్యాగాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తెలంగాణ చరిత్రలో రైతాంగ సాయుధ పోరాటానికి దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం చిరస్థాయిగా నిలిచిపోతుందని,మహనీయుల ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్,స్థానిక ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది,కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అవకాశవాది, గోడమీది పిల్లి సుదర్శన్ గౌడ్ ::: నవాబుపేట్ మాజీ ఎంపీపీ కుర్రోల్ల శీను



వాయిస్ టుడే మహబూబ్నగర్ జిల్లా జులై 4 (జడ్చర్ల)నవాబుపేట మండల్) : అయ్యా సుదర్శన్ గౌడ్ లక్ష్మారెడ్డి పుణ్యమా అంటూ రెండు టర్మ్ లు లక్ష్మారెడ్డి ఎమ్మెల్యేగా గెలిస్తే ఒక్కొక్క టర్మ్ లో నీ బిడ్డల పెళ్లిళ్లు చేసుకున్నావ్ అది మర్చిపోయావా. ? నువ్వు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి అక్కడ ఏదో పెద్ద లీడర్ అని చెప్పుకుంటున్నావు. కానీ నువ్వు పార్టీ ఎందుకు మారవో జడ్చర్ల నియోజకవర్గం ప్రజలందరికీ తెలుసు. నీవు పోలేపల్లి దళిత బిడ్డల దగ్గర తక్కువ ధరకు లాక్కున్న భూముల కోసం మరియు పోలేపల్లి నుంచి రాయపల్లి వెళ్లే దారిలో గుండ్ల గడ్డ తండాకు పక్కన ఉన్న 60 ఎకరాల భూమిలో నీ భాగస్వామ్యం ఉంది. ఆ భూమిలో రైతులకు మీ పార్ట్నర్లకు గొడవ నడుస్తుంది కాబట్టి ఆ భూమి ఎలాగైనా దక్కించుకోవాలనీ . అధికార పార్టీ కాంగ్రెస్ లోకి జంప్ అయ్యి.. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి దగ్గర పైరవి చేసుకొని రైతులను మోసం చేయాలని చూస్తున్నావు.ఇంకా నువ్వు పోలేపల్లిలో మరియు పెద్దపల్లిలో రైతులను మోసం చేసి ,కొన్న భూములకు మొత్తం డబ్బులు చెల్లించకుండా ఇప్పటికీ నీ ఇంటి చుట్టూ చెప్పులు అరిగేలా దళితులను తిప్పుకుంటున్నావు. ఇది నీకేమైనా న్యాయమేనా లక్ష్మారెడ్డి పార్టీలోకి రావడానికి కారణం నేనే అని గొప్పలు చెప్పుకుంటున్నాం కదా ఏమంటివి అంత పెద్ద మనిషిని తెలంగాణ రాష్ట్రం కోసం మొదటిసారి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన వ్యక్తిని బట్టి అన్ని మాటలు అంటావా ఖబర్దార్ నా కొడకా?అసలు ఆ రోజు లక్ష్మారెడ్డి బలమైన నాయకుడు అని తెలిసి పార్టీ అధిష్టానం నుంచి పిలుపు రావడంతో లక్ష్మారెడ్డి అప్పటి టిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది. మొన్నటికి మొన్న జరిగిన 2023 ఎన్నికలలో కూడా కార్యకర్తలకు రోజువారి భోజనం ఖర్చులకు డబ్బులు ఇవ్వాలని లక్ష్మారెడ్డి మీకు డబ్బులు ఇస్తే వాటిని కూడా సగానికి పైగా నొక్కేశావు. ఇంకా నీ గురించి చెప్పాలంటే నీ సొంత ఊర్లో దళితులను ఎలా మోసం చేశావో నీకు అందరికీ తెలుసు అసలు నీ రాజకీయ ప్రస్థానం ప్రారంభమైనప్పటి నుంచి నీకు ప్రజల్లో పెద్దగా గుర్తింపు ఏమీ లేదు కాబట్టి లక్ష్మారెడ్డి వెనక తిరుగుతూ ఉంటే నీకు పార్టీ మండల అధ్యక్షుడు పదవి మరియు సింగిల్ విండో చైర్మన్ పదవులు కూడా ఇవ్వడం జరిగింది. లక్ష్మారెడ్డి నీ అసలు ఊసరవెల్లి రంగు అనితెలియక

నీవు ఎక్కడో అమెరికాలో ఉంటే నిన్ను పిలిచి సింగిల్ విండో చైర్మన్ బాధ్యతలు అప్పగించాడు. నీకు ఆ మాత్రం మానవత్వం లేకపోతే ఎలా తిన్న ఇంటి వాసాలు లెక్క పెట్టే వాడివి పగటిషకాడివి! మరి ? నీవు ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుత ఎమ్మెల్యే నిన్ను దేకడం లేదని అందరికీ తెలిసిందే. పెద్ద ఏదో ఘనకార్యం చేసినట్లు ప్రెస్ మీట్ పెట్టి మరి చెప్తున్నావ్. నీకు ఏమాత్రం మానవత్వం ఉన్న తక్షణమే లక్ష్మారెడ్డి కి బహిరంగ క్షమాపణ చెప్పాలి ఇదే ప్రెస్ మీట్ ద్వారా చెప్పి నీ తప్పుల్ని సరిదిద్దుకో. లేదు అంటే ఊరు బయటకు వెళ్లి స్మశానం వైపు చూడు, మీ తాతలు ముత్తాతలు. ఏం తీసుకెళ్లినారు! ఆరడుగుల జాగా తప్ప! నేను ఇలాగే ప్రవర్తిస్తానని అనుకుంటే అది నీ విజ్ఞతకే వదిలేస్తూ.. భవిష్యత్తులో నీవు ఇలాగే మాట్లాడితే తగిన బుద్ధి చెప్పే సమయం వస్తుందని హెచ్చరిస్తున్నాను.

# ఏకత్వా లో విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలకు కూడా పెద్ద పీట : సింధూర అమరనేని



కృష్ణా జిల్లా/వీరులపాడు(వాయిస్ టుడే) : ఎన్టీఆర్ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9గంటలకు వీరులపాడు మండలంలోని పొన్నవరం గ్రామంలో గల ఏకత్వా అంతర్జాతీయ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఎన్టీఆర్ జిల్లా జూనియర్ బాల బాలికల షూటింగ్ బాల్ జట్ల ఎంపికలను ఘనంగా నిర్వహించినట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కొక్కిరిగడ్డ స్టాలిన్ తెలిపారు. జిల్లాలో ఆసక్తి గల క్రీడాకారులు సుమారు 100మందికి పైగా క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు కడప జిల్లాలోని పులివెందులలో జులై 11, 12 తేదీలలో జరగబోయే 9వ రాష్ట్రస్థాయి అంతర జిల్లాల షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొంటారన్నారని అన్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిధులుగా ఏకత్వా పాఠశాల ఫౌండర్ డైరెక్టర్ మనోజ్ అమరనేని పాల్గొన్నారు. మనోజ్ మాట్లాడుతూ క్రీడలు ఒత్తిడిని తగ్గించి మెదడులో ఆనందాన్ని కలిగించే రసాయనాలను (ఎండార్ఫిన్లు) విడుదల చేయడం ద్వారా మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. తమ పాఠశాలలోని విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలకు కూడా పెద్ద పీట వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సింధూర అమరనేని, ఉప ప్రధానోపాధ్యాయులు ఐశ్వర్య సాంబశివన్, ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ కొసధికారి విజయ్ గోగులముడు, అసోసియేషన్ సభ్యులు పోలుకొండ శ్రీనివాస రావు, వ్యాయామ ఉపాధ్యాయులు సాంబశివరావు, నాగమల్లేశ్వర రావు, ఉపాధ్యాయులు కోనేటి బ్రహ్మం, పడాల చక్ర అనూష, సీనియర్ క్రీడాకారులు హనీత్, హేమంత్, సింధూ తదితరులు పాల్గొన్నారు.

**బాలికల జట్టు**

సీహెచ్ విజిత, పి అనుష్క, ఏ భార్గవి (విజయ ఇంజనీరింగ్ కళాశాల), కె సంకల్ప (కేబీఎన్), టీ లావణ్య, ఎస్కే అయేషా, ఏ ఆకాంక్ష, జి పూజిత, వి పూజిత (ఏకత్వ పాఠశాల), వి రమ్య, టీ శ్రీ కావ్య, జి మానస (జెడ్పీహెచ్ జమ్మవరం )

**బాలుర జట్టు**

పి తేజ (చైతన్య నందిగామ), ఏం అజయ్ (జెడ్పిహెచ్ ఘని ఆట్కూరు), బి చైతన్య, ఏం యశ్విన్ శ్రీరామ్, బి తేజ, కె సన్నీ, (ఏకత్వ పాఠశాల), కే నీరజ్ (లోయోలా కళాశాల ), కె వెంకట కృష్ణా, కె జెస్సి కార్తీక్ (జెడ్పీహెచ్ వెల్లంకి), కె నిర్మల్ కుమార్, జీ సిద్దు (జెడ్పీహెచ్ జమ్మవరం )

# 16వ వార్డులో ఎస్ఐఆర్ ప్రక్రియపై మైనార్టీ సోదరులకు అవగాహన సదస్సు



మక్తల్ జులై 04 వాయిస్ టుడే ప్రతినిధి : మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు షరీఫా మసీదు వద్ద రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి గారి ఆదేశాల మేరకు ముస్లిం ఓటర్లకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు స్థానిక వార్డు కౌన్సిలర్ అల్కురి పావని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియ ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజల్లో, ముఖ్యంగా మైనార్టీ వర్గాల్లో అనేక అపోహలు, అనుమానాలు ఉన్నాయన్నారు. "ఓటర్ల జాబితా నుండి పెద్ద ఎత్తున ముస్లిం ఓటర్లను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. మీ ఒక్క ఓటును సైతం కోల్పోకుండా జాగ్రత్త పడాలి" అని ఓటర్లకు పిలుపునిచ్చారు.

**ఎస్ఐఆర్ ప్రక్రియలో గుర్తుంచుకోవాల్సిన ముఖ్య అంశాలు:**

1. డాక్యుమెంట్లు సిద్ధం చేసుకోండి: బీఎల్ఓ ఇంటికి వచ్చినప్పుడు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం, నివాస ధృవీకరణ పత్రం వంటి అన్ని పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలి.
2. వివరాలు సరిచూసుకోండి: మీ పేరు, ఇంటి నంబర్, వయస్సు, ఫోటో తదితర వివరాలు ఓటర్ జాబితాలో సరిగా ఉన్నాయో లేదో బీఎల్ఓతో కలిసి నిర్ధారించుకోవాలి.
3. కొత్త ఓటర్లు నమోదు: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు, ఇప్పటి వరకు ఓటు నమోదు చేసుకోని వారు వెంటనే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
4. తప్పుడు సమాచారం నమ్మవద్దు: సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దు. ఏదైనా సందేహం ఉంటే నేరుగా బీఎల్ఓ లేదా మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలి.
5. హెల్ప్‌లైన్ వినియోగం: ఓటరు జాబితా సంబంధిత సమస్యల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1950 లేదా Voter Helpline App ను వినియోగించుకోవాలి.

"ప్రజాస్వామ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఓటు కీలకం. ఒక్క ఓటు సైతం వృథా కాకుండా, తొలగింపునకు గురికాకుండా మనమంతా బాధ్యతగా వ్యవహరించాలి" అని కౌన్సిలర్ పావని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ ఏ. రవికుమార్, మైనార్టీ నాయకులు హమీద్ మౌలానా, వసీం, అన్వర్, యూసుఫ్ ,సయ్యద్ , నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొని ఓటర్లకు భరోసా కల్పించారు.

# 150కోట్ల వ్యయంతో బండారు కుశలయ్య స్థాపించిన రైస్‌మిల్

## ప్రారంబించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



మిర్యాలగూడ జూన్ 4 (వాయిస్ టుడే మిర్యాలగూడ: నల్లగొండజిల్లా,మిర్యాలగూడ నియోజకవర్గం, వేములపల్లి మండలం, శెట్టిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రముఖ రైస్ మిల్లర్ బండారు కుశలయ్య నేతృత్వంలో రూ.150 కోట్ల వ్యయంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మితమైన రైస్ మిల్ ను శనివారం స్థానిక ప్రజా ప్రతినిధులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభాకాలం పూర్తయ్యే లోపు పెండింగ్ లో ఉన్న ఎస్ఎల్బిసిప్రాజెక్టు పనులను పూర్తి చేస్తామని మంత్రితెలిపారు.వాతావరణంలో ఎల్నినో ప్రభావం వల్ల వర్షం తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఈ విషయాన్ని గమనంలో పెట్టుకొని పంటల సాగుపై ప్రత్యేకదృష్టిసారించాలన్నారు. వానాకాలంలో రైతులు పండించినపంటలను కొనుగోలు చేసి మేలు చేస్తామని ఆయన అన్నారు. రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో పండిన పంటలకు అనుగుణంగా ధాన్యాన్ని ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసేందుకు వీలుగా రైస్ మిల్లు నిర్మితంకావటంసంతోషకరమన్నారు. తెలంగాణకు బీహార్ బెంగాల్ నుండి కార్మికులు వస్తున్నప్పటికీ పెరుగుతున్న మిల్లులను అణుగుణంగా కార్మికులసంఖ్యతగ్గిపోతున్నదని అందుకే అధునాతనమైన ఏర్పాటుకుమిల్లర్లుముందుకు రావడంజరుగుతుందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మితమైన మి ల్లుల తో స్టోరేజ్ పెరిగి తేమ శాతం తగ్గించే సైలో గో డౌన్ ల నిర్మాణం అవసరమన్నారు. రైస్ మిల్లు ఆధీకరణ వలన నాణ్యత పెరిగి కార్మికులపై తక్కువ ఆధారపడే మిల్లులు రావాలని రాష్ట్రవ్యాప్తంగా సైలో గోడౌన్ ల నిర్మానాలను స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా అమలు చేసేవిధానాన్నిఆలోచిస్తున్నాను అయన తెలిపారు.దేశం నుండి ఎగుమతి అయ్యే బియ్యానికి ప్రోత్సాహకం అందించే విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టనున్నట్లుమంత్రి తెలిపారు.తెలంగాణ లో ఈఏడాది వరి ధాన్యం ఉత్పత్తి తోపాటు కొనుగోలు పెరిగిందని గతంలో 2023 24 సంవత్సరంలో 47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే ఈ సంవత్సరం 81 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేశామని ఉత్తమ్ తెలిపారు. రైతుబంధు పథకం కింద పదివేల 500 కోట్లు యాసంగిలోను 19 వేల 313 కోట్లు, 762,000 మంది రైతులకు రైతు బీమా డబ్బులు వేయడం జరిగిందని తెలిపారు.దేశంలోనేతెలంగాణ రాష్ట్రం వరి ధాన్యం కొనుగోలులో మూడు స్థానంలో ఉందని,తమ ప్రభుత్వం రైతులకు అనుకూలంగా పనిచేస్తుందని గత ప్రభుత్వం కన్న మిన్నగా పనిచేస్తున్నామని మంత్రి తెలిపారు.రైస్ మిల్లర్లు కోరిన విధంగా విద్యుత్ లో అంతరాయం లేకుండా 132 కెవి సబ్ స్టేషన్ ను ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఎమ్మెల్సీ శంకర్ నాయక్,డిసిసి అధ్యక్షులు పున్న కైలాస్ నేత,మాజీశాసన సభ్యులు జూలకంటి రంగారెడ్డి, తిప్పన విజయ సింహా రెడ్డి, ఆల్ ఇండియా రైస్ ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షులు గుమ్మడి వెంకటేశం,మున్సిపల్ చైర్మన్ చిలుకూరు సుధా- బాలకృష్ణ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష-నవీన్, రైస్ మిల్లర్స్ ప్రతినిధులు కర్నాటి రమేష్ గౌరు శ్రీనివాస్ గుండా మల్లయ్య చెక్కిలం రామయ్య చిన్నపరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# విశ్వసనీయతకు పట్టం కట్టిన మంత్రి వాకిటి శ్రీహరి



### మూడోసారి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అల్కూరి రవికుమార్‌కు అవకాశం

### మంత్రి వాకిటి శ్రీహరికి ధన్యవాదాలు తెలిపిన రవికుమార్..

మక్తల్ జూలై 4 వాయిస్ టుడే ప్రతినిధి : సంవత్సరాల తరబడి పార్టీని నమ్ముకుని నిబద్ధతతో విశ్వసనీయతతో సేవ చేసి, ఎదురుచూసిన వారికి కాంగ్రెస్ పార్టీ డొక్కా చేయబోదని, అలాంటి వారికే పట్టం కడతారని మరోసారి వ్యక్తం అయింది. దశాబ్దాల తరబడి అధికారంలో లేకున్నా కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ, మంత్రి వాకిటి శ్రీహరి గారికి చేదోడు వాదోడుగా నిలిచిన అలుకూరి రవికుమార్... వరుసగా మూడోసారి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపికై సత్తా చాటాడు. ఈ సందర్భంగా తనకు మూడోసారి అవకాశం ఇచ్చిన మంత్రి వాకిటి శ్రీహరికి రుణపడి ఉంటాను అని ధన్యవాదాలు తెలిపారు. 2014 నుంచి ఉత్తంకుమార్ రెడ్డి, రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్... ఇలా ముగ్గురు పిసిసి అధ్యక్షులు హయాంలో.. మక్తల్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేసే అవకాశం తనకు ఇచ్చారని, ఈ సందర్భంగా ఆ ముగ్గురు పిసిసి అధ్యక్షులతో పాటు, తనకు ఈ హోదా దక్కడం లో కీలక పాత్ర పోషించిన ప్రస్తుత మంత్రి వాకిటి శ్రీహరి గారికి జీవితాంతం రుణపడి ఉంటానని రవి కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడమే ధ్యేయంగా పార్టీ కోసం అనునిత్యం కృషి చేస్తానని, వరుసగా మూడోసారి తనకు అవకాశం రావడంలో సహకరించిన ప్రతి ఒక్కరుకు ధన్యవాదాలు తెలిపారు. టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా విజయవంతం కావడానికి సహకరించిన టౌన్ కాంగ్రెస్ కీలక నాయకులు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరికి చేతులు జోడించి నమస్కరించారు. రాబోయే రోజుల్లో సైతం ఇదే సహకారాన్ని అందిస్తూ, మక్తల్ టౌన్ లో కాంగ్రెస్ ను తిరుగులేని పార్టీగా , ఎదురులేని శక్తిగా తయారు కావడంలో మరింతగా సహకరించాలని కోరారు.

## సంగారెడ్డి జిల్లా ఆహార భద్రత అధికారి రాజేశ్వర్ హత్నూర మండలంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ శతజయంతి జూనియర్ కళాశాల హాస్టల్‌ను తనిఖీ



వాయిస్ టుడే నర్సాపూర్ నియోజకవర్గంలో హత్నూర మండలంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జూనియర్ కళాశాల హాస్టల్ వంటగది మరియు స్టోర్‌రూమ్‌లో పలు ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, కిరాణా సరుకులు మరియు పిండి పదార్థాల్లో నల్ల బీటిల్స్ (కీటకాలు) మరియు తెల్లని పురుగులు కనిపించాయి. సిబ్బంది పిండిని జల్లెడ పట్టి కీటకాలు, పురుగులను తొలగిస్తున్నట్లు గుర్తించారు. వంటగదిలో నీరు నిల్వ ఉండటం వల్ల నేల జారుడుగా ఉండి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. అదేవిధంగా, భోజనశాల పైకప్పు పలు చోట్ల దెబ్బతిని పెచ్చులు ఊడిపోయే స్థితిలో ఉండటంతో, అవి విద్యార్థులపై పడే ప్రమాదం ఉందని ఆహార భద్రత అధికారి ఆందోళన వ్యక్తం చేశారు.



## అల్లూరి సీతారామరాజు జయంతి ఘనంగా నిర్వహించిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్

శ్రీకాళహస్తి (వాయిస్ టుడే) జూలై 4 : శ్రీకాళహస్తి: భాస్కర్‌పేట మున్సిపల్ హైస్కూల్‌లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్ప, గైడ్ ఇన్‌చార్జ్ నాగజ్యోతి, రాణి, ఏపీజే అబ్దుల్ కలాం ఓపెన్ ట్రూప్ స్కౌట్ మాస్టర్ షేక్ అజారుద్దీన్ అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జ్ఞానప్ప మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య సమరంలో విశిష్ట పాత్ర పోషించిన మహానాయకుడని, ఆయన దేశభక్తి, త్యాగస్ఫూర్తిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చిన్నప్పటి నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.



## దొడ్డి కొమురయ్య ఆశయాలు యువతకు ఆదర్శం!: తాళ్లపల్లి మనోజ్ గౌడ్

సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా జూలై- 04 వాయిస్‌టుడే : జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ పాల్గొని దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా తాళ్లపల్లి మనోజ్ గౌడ్ మాట్లాడుతూ, కేవలం పంతొమ్మిది ఏళ్ల వయసులోనే వెట్టిచాకిరి నిర్మూలన, భూమి కోసం దేశ్‌ముఖ్‌లు, దొరల దోపిడీకి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరా టంలో పాల్గొని తొలి అమరుడిగా నిలిచిన దొడ్డి కొమురయ్య జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలు, పోరాటస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజంలో చైతన్యం కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్, జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు మల్లేశం, ఐలయ్య, బీసీ సంక్షేమ సంఘం నాయకులు స్వామి వివేక్ పటేల్, నల్లవెల్లి శంకర్, జిల్లా కురుమ సంఘం నాయకులు, వివిధ మండలాల కురుమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు..



## ఏన్కూర్‌లో ఘనంగా దొడ్డి కొమరయ్య 80వ జయంతి వేడుకలు

వాయిస్ టుడే /ఏన్కూర్ : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 80వ జయంతి వేడుకలను శనివారం ఏన్కూర్ మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో సీపీఎం మండల కార్యదర్శి దొంతబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు, భూస్వామ్య దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమరయ్య చేసిన త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు. వెట్టిచాకిరి నిర్మూలన, పేద ప్రజల హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కొమరయ్య చూపిన పోరాట స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఉందని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. శ్రామిక వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు ఐక్యంగా పోరాడాలని సూచించారు. గిరిజన సంఘం జిల్లా నాయకులు బానోత్ బాలాజీ, సీఐటీయూ మండల కార్యదర్శి ఏర్పుల రాములు, మాజీ ఎంపీటీసీ భూక్య లక్ష్మా, ఇటికాల లెనిన్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సకల సౌకర్యాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు

**విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ధ్యేయం**

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో టీజీఈడబ్ల్యూ ఐడీసీ ఆద్వర్యంలో రూ.200 కోట్ల నిధులతో వైఐఐఆర్ఎస్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రభుత్వ విప్, శంకుస్థాపన**



చందుర్తి, జూలై -04 (వాయిస్ టుడే): సకల సౌకర్యాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో టీజీఈడబ్ల్యూ ఐడీసీ ఆద్వర్యంలో రూ. 200 కోట్ల నిధులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ (వైఐఐఆర్ఎస్) నిర్మాణానికి శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిలుగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ వేములవాడ నియోజకవర్గనికి ఒక మణిహారంగా నిలుస్తుందని తెలిపారు. త్వరలోనే చందుర్తి -మోత్కూరావు పేట రోడ్డుకు భూమి పూజ చేసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యా విధానంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమూల మార్పులు చేస్తున్నారని వివరించారు. పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచారని గుర్తు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందజేస్తున్నామని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ లో 2600 మంది విద్యార్థులు చదువుతారని, భవన నిర్మాణాన్ని 18 నెలల్లో పూర్తి చేస్తారని చెప్పారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి భూమి ఇచ్చిన వారి సహకారం మరువలేనిదని కొనియాడారు. ఐటీఐలను ఏటీసీలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. రుద్రంగి లో 10 ఎకరాల్లో రూ.46 కోట్లతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణానికి టెండర్లు పూర్తి అయ్యాయని పేర్కొన్నారు. ఆరు కోర్సులు.. 200 పైగా విద్యార్థులు శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించే అవకాశం ఉందని తెలిపారు. మండేపల్లి లో ఇప్పటికే కొనసాగుతుందని వివరించారు. హైదారాబాద్, డిల్లీ పబ్లిక్ స్కూల్ తరహాలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ లను ఏర్పాటు చేయనున్నా మని వెల్లడించారు. ఇటీవల ఆరుట్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారని వివరించారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో వసతులు, విద్యా బోధనపై తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారని వివరించారు. త్వరలో వేములవాడ నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. భీమారం, మేడిపల్లి, కథలాపూర్ మండలాలకు సాగు నీరు అందించే ప్రాజెక్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. మధ్య మానేరు ముంపు గ్రామాల ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి అండగా ఉంటారని పేర్కొన్నారు. జిల్లా గత యాసంగి సీజన్ కంటే ఈ ఏడాది దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ ఎక్కువ చేశామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. మర్రిపల్లి లో 40 ఎకరాల స్థలంలో రైతు విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయనున్నామని, దీంతో రైతులకు భూసార పరీక్షలు చేసేందుకు ఉపయోగపడుతుందని, విత్తనాలు ఇతర సేవలు అందుబాటు లోకి రానున్నాయని తెలిపారు. రాజన్న ఆలయాన్ని రూ.150 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ఆగమ శాస్త్రం ప్రకారం శృంగేరి పీఠాధిపతుల సూచనలతో అభివృద్ధి విస్తరణ చేస్తున్నామని వెల్లడించారు. అలాగే 40 ఎకరాల్లో అత్యాధునిక గోశాల నిర్మాణం చేయనున్నామని పేర్కొన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి బాసర నుంచి భద్రాచలం వరకు అన్ని ఆలయాలను అభివృద్ధి పనులు చేయిస్తున్నారని తెలిపారు. ప్రధాన రోడ్డు విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో నేతన్నలకు కోటి ఇందిరా మహిళా శక్తి చీరల ఆర్డర్ ఇచ్చామని తెలిపారు. రూ. 300 కోట్ల బకాయిల విడుదల చేశామని గుర్తు చేశారు. వేములవాడ మూల వాగుపై బ్రిడ్జి పనులు వేగంగా జరుగుతు న్నాయని తెలిపారు. హైబ్రిడ్ అన్యూటీ మోడల్ (హ్యామ్) కింద వేములవాడ – సిరికొండ మార్గం, ఇతర చోట్ల రోడ్లు మంజూరు అయ్యాయని వెల్లడించారు. మధ్య మానేరు ముంపు గ్రామాల వాసుల సమస్యలపై అసెంబ్లీ లో మాట్లాడానని గుర్తు చేశారు. జిల్లాలో నూతన గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, అధికారులు స్థలాలు గుర్తిస్తున్నారని తెలిపారు. రూ. 1000 కోట్ల నిధులతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ఈ ప్రాంతంలో చేయిస్తున్న అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని, జిల్లా పురోగతిలో భాగస్వామ్యులు కావాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలువు నిచ్చారు.

**అన్ని వసతులతో విద్యాలయం ..**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వేములవాడ నియోజకవర్గంలో అన్ని వసతులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ విద్యాలయం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర దేశాలు, ప్రాంతాల్లో అధ్యయనం చేయించారని పేర్కొన్నారు. మూడపల్లి లో అనువుగా ఉన్న స్థలాన్ని స్కూల్ కోసం కేటాయించామని వెల్లడించారు. వేములవాడకు దగ్గరలో ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సౌకర్యంగా ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ స్టాఫ్ కు ప్రత్యేక వసతి గదులు, డైనింగ్ హాల్, ల్యాబ్ లు, అత్యాధునిక వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాలలో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించే కామన్ మెనూ ప్రకారం ప్రకటించారని, ప్రతి వారం చికెన్, మటన్, ఇతర ఆహార పదార్థాలను పక్కాగా అందిస్తున్నారని తెలిపారు. జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులు తనిఖీ చేసి . భోజనం, వసతులు పరిశీలించి.. వారితో కలిసి భోజనం చేసి నివేదిక ఇస్తున్నారని వెల్లడించారు. జిల్లాలో 61 ప్రీ ప్రైమరీ స్కూల్స్ ప్రారంభం అయ్యాయని తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ వసతులు సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. మంచి ఉద్యోగాలు, తాము ఎంచుకున్న రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.

టీజీఈడబ్ల్యూ ఐడీసీ ఎండీ గణపతి రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు చేయగా, 60 చోట్ల పనులు మొదలు అయ్యాయని తెలిపారు. జిల్లాలో దాదాపు 18 నెలల్లో పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరాల శేఖర్, ఆత్మ కమిటీ చైర్మన్ ముకుందరెడ్డి, టీజీఈడబ్ల్యూ ఐడీసీ ఎస్ఈ రవీందర్, ఈఈ అశోక్ కుమార్, వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, తహసిల్దార్ భూపతి, ఏఈ శ్రీకాంత్, సర్పంచ్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# రూ.41 లక్షలతో 49వ డివిజన్‌లో సీసీ రోడ్డు,డ్రైనేజీ పనులకు శ్రీకారం

**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**



కరీంనగర్,జూలై 04(వాయిస్ టుడే): నగరపాలక సంస్థ పరిధిలోని 49వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధుల నుండి రూ.41 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తో కలిసి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉండిపోయిన రోడ్డు కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని రూ.41 లక్షల నిధులను మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పనులను నాణ్యతతో,వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. 49వ డివిజన్‌లో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కొత్త పైప్‌లైన్ మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా మురుగు కాలువల పూడికతీత పనులను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. నగర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని,రూ.50 కోట్ల యుఐడిఎఫ్ నిధులతో నగరంలోని 66 డివిజన్లలో అభివృద్ధి పనులను రాబోయే మూడు నుంచి నాలుగు రోజుల్లో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా 49వ డివిజన్ అభివృద్ధి కోసం అదనంగా రూ.50 లక్షలు కేటాయించామని, త్వరలోనే ఆ పనులు కూడా ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు నగరపాలక సంస్థ ప్రాధాన్యం ఇస్తోందని,కరీంనగర్‌ను మరింత అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని మేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు,మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్,స్థానిక కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్,కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు,పార్టీ నాయకులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సరస్వతీ శిశు మందిర్‌లో నరేంద్ర వివేక కేశవ-మాధవ ప్రతిభా పురస్కారాల అందజేత



కరీంనగర్,జూలై 04 (వాయిస్ టుడే); రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది సందర్భంగా శ్రీ రామభక్తుడైన కొమ్మర చంద్రశేఖర్ రెడ్డి పూర్వవిద్యార్థి సంకల్పించిన విధంగా నరేంద్ర-వివేక కేశవ-మాధవ ప్రతిభా పురస్కారాలను,శ్రీ సరస్వతీ శిశు మందిర్,కరింనగర్ లో గత సంవత్సరం నుండి ఇవ్వడం జరుగుతుంది. వీటిని ప్రతి ఏడాదీ జూలై 4 వ తేదీన స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని మరియు స్వామి వివేకానంద మహాసమాధి దినాన్ని పురస్కరించుకొని స్కూల్ లో నిర్వహించే సభలో అందచేస్తారు. ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు క్లాస్ లో మొదటి ర్యాంకు సాధించిన ప్రతి విద్యార్థికి 1,116 రూపాయలను,రెండవ ర్యాంకు సాధించిన ప్రతి విద్యార్థికి 816 రూపాయలను,మూడవ ర్యాంకు సాధించిన ప్రతి విద్యార్థికి 616 రూపాయలను మరియు మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు క్లాస్ లో మొదటి ర్యాంకు సాధించిన ప్రతి విద్యార్థికి 2,116 రూపాయలను, రెండవ ర్యాంకు సాధించిన ప్రతి విద్యార్థికి 1,516 రూపాయలను, మూడవ ర్యాంకు సాధించిన ప్రతి విద్యార్థికి 1,316 రూపాయలను మరియు మెరిట్ సర్టిఫికెట్లను అందచేసారు. పురస్కార గ్రహీతలకు జీవితాంతం స్ఫూర్తినిచ్చే విధంగా ప్రతి సర్టిఫికెట్ పైనా అరేస్ అవేక్, స్టాప్ నాట్ టిల్ ధ గోల్ రీచిడ్ అనే స్వామి వివేకానంద సూక్తిని ముద్రించారు. ఇంకా సరస్వతీ మాత,స్వామి వివేకానంద,ఆరెస్సెస్ వ్యవస్థాపకులైన పరమపూజ్య డాక్టర్ కేశవ బలిరాం హెడ్గేవార్ జీ, ఆరెస్సెస్ రెండవ సర్ సంఘ చాలక్ ఐన పరమ పూజ్య మాధవ సదాశివ గోల్వాల్కర్ జీ ల చిత్రాలను ముద్రించారు. ముఖ్య వక్తగా సిఎ నిరంజన చారి అల్లూరి సీతారాములు గొప్పతనాన్ని గూర్చి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి,కొమ్మెర ప్రవీణ్ కుమార్ రెడ్డి, కోల రామచంద్ర రెడ్డి,కొలుగూరి సదాశివ రెడ్డి,దేవరకొండ లక్ష్మణ్ మూర్తి,గుగ్గిళ్ల రమేష్,గుజ్జ శ్రీనివాస్, గట్టు శ్రీనివాస్,ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## విద్యుత్ షాక్‌కు గురై మహిళా మృతి

,మాద్గులపల్లి జూలై 4(వాయిస్టుడే) : విద్యుత్ ప్రమాదానికి గురై మహిళ మృతిచెందిన సంఘటన శనివారం మాద్గులపల్లిమండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కుక్కడం గ్రామపంచాయతీ పరిధిలోని చింతలగూడెం ఆవాస ప్రాంతానికి చెందిన కోలగట్ల ఆండాలమ్మ (65 )ఉదయం సుమారు తన ఇంటి లోని కరెంటు మోటార్ ను ఆన్ చేయబోగా ప్రమాదవశాత్తు ఎడమ చేతికి కరెంట్ షాక్ తగలడంతో విద్యుత్ షాక్ గురై మోటర్ పై పడి అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. మృతురాలి భర్త జాన్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ తెలిపారు. మృతురాలికి భర్తతోపాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు.



## బీసీ హాస్టల్ ను ఆకస్మిక తనిఖీ చేసిన డిఆర్డిఓ జ్యోతి

వాయిస్ టుడే నర్సాపూర్ : సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రంలో గల బిసి హాస్టల్ ను డిఆర్డిఓ హాస్టల్ వసతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ తనిఖీ సందర్భంలో భాగంగా హాస్టల్లో నెలకొన్న అరకుర వసతులను చూసి డిఆర్డిఓ ఒక్కసారిగా అవాక్కయ్యారు. కుళ్ళిన కూరగాయలు బియ్యం.పప్పు.చింతపండులో పురుగులు ఉన్నాయి.విద్యార్థుల కోసం హాస్టల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్విచ్లు అస్తవ్యస్తంగా విద్యార్థులకు ప్రమాదకరంగా ఉండడాన్ని చూసి హాస్టల్ వార్డెన్ శంకర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం బలవర్ధకమైన మంచి ఆహారాన్ని అందించాలని పలుమార్లు ముఖ్యమంత్రి కోరుతున్న కిందిస్థాయి అధికారుల తీరు మారడం లేదని మీరు ప్రతిరోజు విద్యార్థులకు నాసిరకమైన ఆహారాన్ని అందించడం ఏమిటని వార్డెన్ ను ప్రశ్నించగా నోరు విప్పకుండా మౌనంగా ఉండిపోయిన వార్డెన్ శంకరయ్య ఇకమీదట ఇలాంటి పరిస్థితులు పునారావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని డిఆర్డిఓ వార్డెన్ హెచ్చరించారు.



## జహీరాబాద్‌లో 'ఇందిరా మహిళా శక్తి' చీరల పంపిణీ

వాయిస్ టుడే ఝరాసంగంజులై 04 : జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో శనివారం 'ఇందిరా మహిళా శక్తి' పథకం కింద అర్హులైన మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్,మెప్మా. అ ర్ పీ స్ సిబ్బంది మరియు మెప్మా రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, పంపిణీ ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా జరిగేలా మున్సిపల్ అధికారులు పర్యవేక్షించారు. చీరలు అందుకున్న మహిళలు ఈ సందర్భంగా ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మెప్మా ఆర్పీలు,వార్డు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పదవీ విరమణ ఉద్యోగుల సంఘానికి ఓల్డ్ పీహెచ్‌సీ భవనం కేటాయింపు

వాయిస్ టుడే/వైరా ప్రతినిధి: జిల్లా వైద్య ఒ ఆరోగ్య శాఖాధికారి (ఐవీడిఎూ), ఖమ్మం ఆదేశాల మేరకు ఏన్కూరు మండలంలోని ఓల్డ్ ూచీవీ క్వార్టర్స్/ఓల్డ్ పీహెచ్‌సీ భవనాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పదవీ విరమణ ఉద్యోగుల సంఘం, ఏన్కూరు శాఖ కార్యకలాపాల నిర్వహణ కోసం తాత్కాలిక ప్రాతిపదికన కేటాయిస్తూ వైద్యాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సంబంధిత సంఘ ప్రతినిధులకు భవనాన్ని అధికారికంగా అప్పగించారు. పదవీ విరమణ ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలు, సమావేశాలు మరియు ఇతర సంఘ కార్యకలాపాల నిర్వహణకు ఈ భవనం ఉపయోగపడనుందని అధికారులు తెలిపారు. సంఘ ప్రతినిధులు ప్రభుత్వానికి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు ఘన నివాళి

కరీంనగర్,జూలై 04(వాయిస్ టుడే): మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ మరియు బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధిడ డిప్యూటీ మీ ఏరియా యాదగిరి సునీల్ రావు పాల్గొని రోశయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాలుగు సార్లు శాసనమండలి సభ్యునిగా సేవలందించి రెండుసార్లు శాసనసభ సభ్యునిగా కూడా ప్రజల తరపున పనిచేసిన వ్యక్తి,రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా వ్యవహరించి, అత్యధికంగా 16 సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అరుదైన ఘనత రోశయ్యది అని అన్నారు.అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి మరణానంతరం, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 14 నెలల పాటు రాష్ట్రాన్ని పాలించి. ఒకసారి పార్లమెంట్ సభ్యునిగా కూడా ఎన్నికై తమ సేవలను అందించి శాసనమండలి,శాసనసభ మరియు పార్లమెంట్ చట్టసభల్లో పనిచేసిన గొప్ప నాయకుడిగా రోశయ్యకు పేరుందని తెలిపారు.2011 నుండి 2016 వరకు తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా పూర్తికాలం పాటు తమ బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించారు.ఆర్య వైశ్య కులంలో జన్మించిన ఆయన ఒక గొప్ప జాతీయ నాయకుడిగా ఎదిగారు.దేనికీ బెదరకుండా,ప్రతి విషయంపై పూర్తి స్థాయి అవగాహనతో వ్యవహరించే గొప్ప రాజకీయ పరిణతి ఉన్న నాయకుడు ఆయన.ఏ ముఖ్యమంత్రి మంత్రివర్గంలో పనిచేసినా,వారికి అత్యంత విశ్వసనీయమైన వ్యక్తిగా మెలిగి వారి పూర్తి నమ్మకాన్ని చూరగొన్న వ్యక్తి కొణిజేటి రోశయ్య. వారి జయంతి సందర్భంగా వారి విశేషమైన



సేవలను,మచ్చలేని రాజకీయ జీవితాన్ని స్మరించుకుంటూ వారికి చిత్రపటానికి పూలమాలవేసి మనస్ఫూర్తిగా నివాళులు అర్పించడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో నగరపాలక మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, పలువురు కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొని నివాళులు అర్పించారు.

# దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో ఉద్యమిస్తాం

### ::: సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి



కరీంనగర్,జూలై 04 (వాయిస్ టుడే): భూమికోసం,భుక్తి కోసం,వెట్టిచాకిరి విముక్తి కోసం నాడు సాగించిన వీరోచిత, చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో జిల్లాలో ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి అన్నారు.పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి సిపిఎం జిల్లా కార్యాలయం ముకుందలాల్ మిశ్రాభవన్లో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ యుక్త వయసులోనే తన నెత్తురుతో నేల తల్లి రక్త తిలకం దిద్ది పోరు శంఖం ఊదిన ధీరుడు దొడ్డి కొమరయ్య అన్నారు.ఆనాడు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ప్రదర్శనలో భాగంగా కడివెండి గ్రామంలో ముందు వరుసలో ఉన్న దొడ్డి కొమరయ్యను విసునూరు దేశ్ముఖ్ రామచంద్రారెడ్డి గూండాలు గడి పైనుండి జరిపిన కాల్పుల్లో నేలకొరిగాడన్నారు.ఆయన బలిదానం తెలంగాణ ప్రజల్లో ఆగ్రహ జ్వాలలు రగిలించిందని రైతాంగ సాయుధ పోరాటానికి నాంది పలికిందన్నారు.రాష్ట్ర సర్కార్ మిగులు భూములు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.కోనేరు రంగారావు కమిషన్ నివేదికను పాలకులు అటకెక్కించారని విమర్శించారు.ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల ఇండ్లనుకూల్చడమేనా అని ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం దేశభక్తి పేరుతో దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందన్నారు. అన్నదమ్ముల వలె కలిసి జీవిస్తున్న మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ పబ్బం గడుపుకుంటుందన్నారు.ఆనాడు కేవలం భూమి కోసమే పోరాటం జరగలేదని, సామాజిక న్యాయం కోసం,సమానత్వం కోసం,కుల నిర్మూలన,కుల వర్ణ వివక్షల వ్యతిరేకంగా అసమానతలు లేని సమాజం కోసం ఉద్యమించారన్నారుదొడ్డి కొమురయ్య ఆశయ స్ఫూర్తితో జిల్లాలో పేద,బడుగు, బలహీన వర్గాల పక్షాన రాజీ లేని పోరాటాలు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఉప్పునుటి శ్రీనివాస్,ఎడ్ల రమేష్,డి నరేష్ పటేల్,నాయకులు రాయికంటి శ్రీనివాస్, పుల్లల మల్లయ్య,గజ్జల శ్రీకాంత్,కే అరవింద్,శివ,లక్ష్మి,మానస,ఆకాష్,సందేశ్ పాల్గొన్నారు.

## ఆర్థిక సంక్షోభం లేకుండా రికార్డు బడ్జెట్లు ప్రవేశపెట్టిన గొప్ప నాయకుడు రోశయ్య

### కాంగ్రెస్ నగర అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్

కరీంనగర్,జూలై 04 (వాయిస్ టుడే): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక సంస్కరణలు చేపట్టి,ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లిన మహోన్నత వ్యక్తి రోశయ్య అని కాంగ్రెస్ నగర అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్అన్నారు. డీసీసీ కార్యాలయంలో కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కంకణాల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి,మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి కొణిజేటి రోశయ్య 93వ జయంతి హంగనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మున్సిపల్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్, ఆర్జిపిఎస్ జిల్లా చైర్మన్ మడుపు మోహన్ హాజరైరోశయ్య చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు.వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ రోశయ్య నాయకత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం లేకుండా నాటి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా అవలీలగా బడ్జెట్ ను ప్రవేశపెట్టి రికార్డు స్థాయిలో ఫైనాన్స్ మినిస్టర్ గా పని చేసిన అనుభవం ఉన్న వ్యక్తిగా కొనిజేటి రోశయ్య రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలలో ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్నారు.వారు చేపట్టిన ఆర్థిక సంస్కరణల ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆర్థికంగా అన్ని రంగాలలో అభివృద్ధి చెందింది, వైయస్సార్ లాంటి ముఖ్యమంత్రుల నాయకత్వంలో పనిచేసినటువంటి సుదీర్ఘ రాజకీయ అనుభవం నేతగా చివరి వరకు కాంగ్రెస్ పార్టీ పట్ల




చిత్తశుద్ధితో పనిచేసిన రోశయ్య సేవలను సమరించుకుంటూ వారికి నివాళులర్పించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ నగర అధ్యక్షులు అహమ్మద్ అలీ,కామ్ రెడ్డి రామ్ రెడ్డి,ఫహద్, పంజాల స్వామి గౌడ్,ఇమ్రాన్ ఘని, వసీం,అందే శంకర్,రంగు రాజు,రంగు నరేష్ పాల్గొన్నారు.

# పారదర్శకంగా ప్రజా పంపిణీ వ్యవస్థ

### రేషన్ షాపుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ



మానకొండూర్,జూలై 04(వాయిస్ టుడే): ప్రజలకు నిత్యవసర వస్తువుల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శంగా పనిచేసేలా ప్రజాపంపిణీ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్ మండలం మానకొండూర్,అన్నారం, పచ్చునూరు గ్రామాల్లో చౌకధరల దుకాణాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన నిత్యావసర సరుకులను ప్రభుత్వ నిర్ణయించిన ధరలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ప్రతి అర్హులైన లబ్ధిదారునికి రేషన్ సరుకులు అందించడమే కాకుండా సరకుల పంపిణీలో ఎలాంటి అవకతవకలు లేకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకున్నదన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన చౌక ధరల దుకాణాల ద్వారా గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని చెప్పారు.రేషన్ దుకాణాల నిర్వహణలో పారదర్శకత,జవాబుదారీతనం ఉండాలని సంబంధిత డీలర్లకు సూచించారు.ప్రజలకు నిర్ణీత సమయంలో నాణ్యమైన బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మానకొండూర్ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి,పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు, ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు తాళ్లపల్లి నరేష్,బందెల మహేందర్, బి.మల్లయ్యగౌడ్,పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్,బొట్ల స్వరూప-కిషన్,రామిడి తిరుమల్ రెడ్డి,ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి,రొంటాల శ్రీనివాస్ రెడ్డికనకం అశోక్,ఇర్ఫాన్,కొండ్ర సురేష్, కొత్తకొండ శంకర్,కొండ్ర సంపత్,బుర్ర శ్రీధర్ గౌడ్,ఎడ్ల శ్రీధర్,తమిశెట్టి రాజేష్ పాల్గొన్నారు.



### డిప్యూటీ మేయర్‌కు
### పెద్దమ్మ తల్లి బోనాల మహోత్సవంకు ఆహ్వానం

కరీంనగర్,జూలై 04(వాయిస్ టుడే): పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గత 50 సంవత్సరాలుగా ఆనవాయితీగా నిర్వహిస్తున్న 'శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి బోనాల మహోత్సవం' ఈ సంవత్సరం కూడా అత్యంత వైభవంగా జరగనుందని పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కోలకాని నర్సయ్య,ప్రధాన కార్యదర్శి పండుగ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేది ఆదివారం నిర్వహించనున్న ఈ వేడుకలకు హాజరుకావాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు గారిని సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేసి జాతరకు ఆహ్వానించారు.ఈ పవిత్ర బోనాల మహోత్సవంలో కట్టరాంపూర్, బోయవాడ,భగత్ నగర్ మరియు జ్యోతినగర్ ప్రాంతాల నుండి ముదిరాజ్ మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు తీసుకువచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు.మేళతాళాలు, డప్పు చప్పుళ్లు,పసుపు-కుంకుమలు, గాజులతో ఈ ఉత్సవం అత్యంత కన్నులపండువగా నిర్వహించబడుతుందని తెలిపారు.

## సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పాటు

### ::: చైర్మన్‌గా డా.మేడిపల్లి సత్యం
### సభ్యులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, తుమికి పవన్ కుమార్





కరీంనగర్,జూలై 04(వాయిస్ టుడే): సమగ్ర ఓటరు సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు ముగ్గురు సభ్యులతో కూడిన జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పాటు చేశారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా చొప్పదండి ఎమ్మెల్యే ,డా. మేడిపల్లి సత్యం,డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,ఈ ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఎ 2 లకు ఎదురయ్యే సాంకేతిక న్యాయపరమైన ఇబ్బందులు సమస్యలపై స్పందిస్తూ వాటికి కోర్టు ద్వారా పరిష్కార మార్గాలు చూపే న్యాయ సలహా దారుగా సీనియర్ న్యాయవాది తునికి పవన్ కుమార్ ను నియమించడం జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన జిల్లాలోని బూత్ లెవెల్ ఏజెంట్ 2 లు తమ మండల,నియోజకవర్గ స్థాయి ఈ ఆర్ ఓ లను సంప్రదించడం ద్వారా సక్రమమైన పద్ధతిలో ఓటరు సవరణ కార్యక్రమం కొనసాగే విధంగా నిజమైన ఓటర్లకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకునేందుకు బాధ్యత వహించడంలో ఎదురయ్యే సమస్యలపై స్పందించడానికి పిసిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా వెల్లడించారు.





## అడవి జంతువుల వల్ల పంట నష్టాన్ని పసల్ భీమా యోజన పరిధిలోకి తీసుకురావాలి

### కవయిత్రి మంజుల పత్తిపాటి మంజుల

తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన కవయిత్రి, మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజుల పత్తిపాటి మాట్లాడుతూ రైతు కష్టం అనేది కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదని, ప్రకృతి వైపరీత్యాలతో పాటు కోతులు, అడవి పందుల బెడద రైతన్నకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందని అన్నారు. అడవుల నరికివేత వల్ల కోతులు,అడవి పందులు తమ సహజ వాసాలను కోల్పోయి ఆహారం కోసం గ్రామాలు,నగరాల వైపు వస్తున్నాయని,వాటిని రక్షించడంతో పాటు రైతుల పంటలను కూడా కాపాడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.గతంలో రైతులు పొలాల్లో కూరగాయలు, సజ్జలు,జొన్నలు,మొక్కజొన్న వంటి పంటలను సాగు చేసేవారని,అయితే కోతులు,అడవి పందుల దాడుల కారణంగా ప్రస్తుతం ఎక్కువ మంది రైతులు వరి,పత్తి సాగుకే పరిమితమవుతున్నారని తెలిపారు. అడవి జంతువుల దాడుల వల్ల జరిగే పంట నష్టాన్ని స్థానిక ప్రకృతివిపత్తుగా గుర్తించి, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతులకు పూర్తి పంట నష్టపరిహారం సకాలంలో అందేలా ప్రభుత్వం నిబంధనలను మరింత కఠినతరం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.అడవి పందులు పామాయిల్ తోటలను కూడా వదలడం లేదని, తమ బలమైన ముట్టెతో భూమిని తవ్వి వేర్లతో సహా మొక్కలను నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.అడవి పందులు గ్రామాల్లోకి రాకుండా ఉండేందుకు అటవీ శాఖ అడవుల్లో దుంపలు, పండ్ల మొక్కలను విస్తృతంగా నాటడంతో పాటు,నీటి వసతి కోసం చెక్‌డ్యామ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.అలా చేస్తే అడవి జంతువులు అడవుల్లోనే ఉండి, రైతులు వరికి ప్రత్యామ్నాయంగా వివిధ పంటలను సాగు చేసే పరిస్థితి ఏర్పడుతుందని మంజుల పత్తిపాటి పేర్కొన్నారు.




### కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పై
## వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తెలంగాణ శ్యామ్
### ఎల్ఎండి పోలీసులకు ఫిర్యాదు చేసిన సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ

తిమ్మాపూర్,జూలై 04(వాయిస్ టుడే): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో పగిడిపల్లి శ్యామ్ (తెలంగాణ శ్యామ్)పై ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది.గునుకుల కొండపూర్ సర్పంచ్,బిజెపి రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ,నాయకులు బొంతల కళ్యాణ్ చంద్ర,గాజే రమేష్, తిమ్మాపూర్ మండల బీజేపీ అధ్యక్షుడు చింతం శ్రీనివాస్,సుగుర్తి జగదీశ్వర చారి,గడ్డం అరుణ్,బూట్ల శ్రీనివాస్ లతో కలిసి లిఖితపూర్వకంగా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.గత జూన్ 20న కొత్తపల్లి గ్రామంలో ఎల్లమ్మ బోనాల సందర్భంగా రెండు వర్గాల మధ్య చిన్నపాటి వివాదం జరిగింది.ఈ వివాదానికి ఎటువంటి సంబంధం లేని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్,స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై పగిడిపల్లి శ్యామ్ అలియాస్ తెలంగాణ శ్యామ్ బాధ్యతారహితంగా,రెచ్చగొట్టేలా మాట్లాడారని అజయ్ వర్మ ఫిర్యాదులో పేర్కొన్నారు.జూలై 2వ తేదీన ఒక యూట్యూబ్ న్యూస్ ఛానల్ (జి.8 )లో తెలంగాణ శ్యామ్ మాట్లాడుతూ కేంద్రమంత్రి,ఎమ్మెల్యే గ్రామానికి వస్తే చెప్పులతో కొట్టండి అంటూ ప్రజలను రెచ్చగొట్టే, ప్రేరేపించేలా వ్యాఖ్యానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ రకమైన వ్యాఖ్యలు గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే కాకుండా, ప్రజాస్వామ్య విలువలను,ప్రజా ప్రతినిధులను అవమానించేలా ఉన్నాయని ఫిర్యాదుదారుడు సొల్లు అజయ్ వర్మ ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఆధారాలను సిడి పోలీసులకు సమర్పించారు.ఈ విషయాన్ని పరిశీలించి,తక్షణం తెలంగాణ శ్యామ్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ అజయ్ వర్మ కోరారు.

# ఘనంగా దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు

జమ్మికుంట జూలై 4 (వాయిస్ టుడే) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మరియు కర్ణాటక రాష్ట్రాల మాజీ గవర్నర్ దివంగత నేత కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం జమ్మికుంట మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్, కమిషనర్ మాట్లాడుతూ రోశయ్య ప్రజా సేవలను, ఆయన రాజకీయ జీవితాన్ని స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం రోశయ్య జయంతిని అధికారికంగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించాలని నిర్ణయించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రిగా రోశయ్య ప్రవేశపెట్టిన బడ్జెట్లు, ప్రజా సంక్షేమానికి ఆయన చేసిన కృషి, ఉమ్మడి రాష్ట్ర అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన నిజాయితీ, నిరాడంబరత, పరిపాలనా దక్షత యువతకు ఆదర్శంగా నిలుస్తాయని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, కౌన్సిలర్లు చందా రాజు, దిడ్డి కోమల, ఒగ్గు రమేష్, గుర్రం కావ్య, లక్ష్మణ్, కొలుగూరి సురేష్, పొనగంటి విష్ణు, యాట్ల సునీత అశోక్, మాచర్ల రాజు, కుతాడి తిరుపతి, మున్సిపల్ అధికారులు జేఏవో రాజశేఖర్ రెడ్డి, ఏఈ వికాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ (ఇన్‌చార్జ్) ఇల్లందుల రమేష్, దీపిక, టీపీబీవో, ఎం శ్రీనివాస్ సీనియర్ అసిస్టెంట్ , వార్డు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బహుజన్ సమాజ్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ నూతన కమిటీ ఎంపిక



హుజూరాబాద్ జూలై 4 (వాయిస్ టుడే): బహుజన్ సమాజ్ పార్టీ కరీంనగర్ జిల్లా, హుజురాబాద్ నియోజకవర్గం లోని అన్నీ కమిటీలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర అధ్యక్షులు ఆదేశాలతో, జిల్లా అధ్యక్షుల ఆమోదంతో నియోజకవర్గ అధ్యక్షులు గిన్నారపు మహేందర్ అధ్యక్షతన నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా కండె తిరుపతి, కార్యదర్శిగా మాతంగి అశోక్ నీ నియమించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆదిలాబాద్ జోన్ ఇంచార్జీ పల్లె ప్రశాంత్ గౌడ్, పార్లమెంట్ ఇంచార్జీ దొడ్డే శ్రీనివాస్ నూతనంగా నియమితులైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కప్పల రవి కుమార్, నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ అంబాల ప్రభాకర్ హాజరై బాబాసాహెబ్ అంబేద్కర్, కాన్షిరాం ఆశయాలను, బీఎస్పీ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, నియోజకవర్గంలో బహుజన వర్గాలలో ఉన్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలని,రానున్న 2028 ఎన్నికలకు బహుజన కులాలను ఏకం చేసి రాజ్యాధికారం సాధించే దిశగా సాగాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు మారపెల్లి మొగిలయ్య, రామ్ రాజేశ్వర్, ఇల్లందుల రమేష్, అచ్యుత్, తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ దూరవిద్య ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల

### ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎస్.ఓ. కుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ కే. రాజేంద్రం

జమ్మికుంట జూలై 4 (వాయిస్ టుడే): జమ్మికుంట పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ ఉ పీజీ కళాశాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (దీ=ూూఖ) ద్వారా డిగ్రీ దూరవిద్య ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలైనట్లు కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎస్.ఓ. కుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ కే. రాజేంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి గానూ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులలో చేరాలనుకునే ఆసక్తి గల విద్యార్థులు ఈ ఏడాది ఆగస్టు 7వ తేదీ (07-08-2026) లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్తగా చేరేవారితో పాటు ప్రస్తుతం ద్వితీయ, తృతీయ సంవత్సరాలు చదువుతున్న విద్యార్థులు కూడా తమ వార్షిక ట్యూషన్ ఫీజును నిర్ణీత గడువులోగా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రవేశాలు మరియు ఇతర పూర్తి వివరాల కోసం విద్యార్థులు 7382929775 ఫోన్ నెంబరులో సంప్రదించవచ్చని పేర్కొంటూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అద్భుతమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




# నిరుపేదలకు వరప్రదాయని ముఖ్యమంత్రి సహాయనిధి

### పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

### 91 మంది లబ్ధిదారులకు

### 39 లక్షల 42 వేల రూపాయల విలువైన చెక్కుల పంపిణీ..

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నిరుపేదలకు వరప్రదాయనిగా నిలుస్తోందని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, డివిజన్లు, మున్సిపాలిటీలకు చెందిన 91 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన 39 లక్షల 42 వేల రూపాయల విలువైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలకు అత్యవసర వైద్య చికిత్సలు, ప్రమాదాలు, ఇతర క్లిష్ట పరిస్థితుల్లో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం అండగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా అనేక నిరుపేద కుటుంబాలు ఆర్థిక భారం నుంచి ఉపశమనం పొందుతున్నాయని అన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను చేరవేయడంలో కట్టుబడి



ఉన్నామని, అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. ప్రజలకు అవసరమైన ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని వారి గడప వద్దకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అంశంలో దళారులను ఆశ్రయించ వద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, అంతిరెడ్డి, శ్రీకాంత్, నారాయణరెడ్డి, దుర్గారెడ్డి, రామచందర్, మేరాజ్ ఖాన్, వెంకటేష్, వెంకటేష్ నాయక్, నిజాముద్దీన్ బాబా, సల్మాన్, వినోద్, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ సీనియర్ నాయకులు భుజంగ రెడ్డి 50వ జన్మదిన వేడుకలు

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : పఠాన్ చేరు నియోజకవర్గం, ఇంద్రేశం మున్సిపాలిటీ బచ్చుగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భుజంగ రెడ్డి 50వ జన్మదిన వేడుకలు పద్మావతి ఫంక్షన్ హాల్ లో అత్యంత వైభవంగా జరిగాయి. ఆయన 49 ఏళ్లు పూర్తి చేసుకొని 50 వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా అభిమానులు, పార్టీ శ్రేణులు ఈ వేడుకలను పండుగలా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, యువత, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, మండల అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, రామేశ్వరం బండ గ్రామ పెద్ద కౌన్సిలర్ అంతిరెడ్డి, నాయకులు భారీ ఎత్తున తరలివచ్చారు. భుజంగ రెడ్డి కి గజ మాలలు,పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అభిమానులు, యువత మధ్య ఆయన భారీ కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, అనంతరం పలువురు మాట్లాడుతూ: భుజంగ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నిరంతరం ప్రజల్లో ఉంటూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునే నిజమైన ప్రజా నాయకుడు. ఆయన ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ జన్మదిన వేడుకల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు



## ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మొహమ్మద్ నిజాముద్దీన్ బాబా

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 277, 279 పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్లు సాయి కిరణ్ , సాయి రాం లతో కలిసి మొహమ్మద్ నిజాముద్దీన్ బాబా (కో-ఆప్షన్ సభ్యులు, ఇస్నాపూర్ మున్సిపాలిటీ) ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ఓటరు జాబితాలో పేరు నమోదు, వివరాల సవరణ, చిరునామా మార్పు, పేరు తొలగింపు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారాలను నింపి నిర్ణీత గడువులోపు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. నిజాముద్దీన్ బాబా మాట్లాడుతూ, "ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అమూల్యమైనది. ప్రతి అర్హత కలిగిన ఓటరు ఎన్నికల జాబితాలో తన పేరు సక్రమంగా నమోదై ఉండేలా అందరూ బాధ్యతగా వ్యవహరించాలి. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని" కోరారు.



# రైతుల సేవే విండోల లక్ష్యం కావాలి

### ::: ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్,జూలై 04(వాయిస్ టుడే):రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు పని చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్ సింగిల్ విండో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విండో చైర్మన్ గా నాగిశెట్టి రాజయ్య, డైరెక్టర్లుగా ఏనుగుల చొక్కారెడ్డి,కత్తెర్ల రాజు,మంగురపు నర్సవ్వ,సుధగోని తిరుపతిగౌడ్,గాలి మొగిలి,కొట్టె అంజిరెడ్డి,ఎం.రామకృష్ణ,దూలం దేవేంద్ర,కొలిపాక మొగిలి,బుర్ర శ్రీకాంత్,కుర్ర వెంకటస్వామి,ఏగోళపు శ్రీనివాస్ గౌడ్ ల చేత జిల్లా సహకార శాఖ సీనియర్ రిజిస్ట్రార్ శైలజ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతన్నలకు అండగా నిలవాలని,సింగిల్ విండో వ్యవస్థ ద్వారా రైతులకు సకాలంలో విత్తనాలు,ఎరువులు,పంట రుణాలు, పంటల బీమా వంటి సేవలను పారదర్శకంగా అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికే పెద్దపీట వేస్తున్నదని,రైతు భరోసా కింద ఎకరానికి ఏటా రూ. 12,000 పెట్టుబడి సాయం,రూ. 2 లక్షల వరకు పంట రుణమాఫీ అమలు చేస్తున్నదని,అర్హులైన ప్రతి రైతుకూ అందేలా సింగిల్ విండోలు కీలక పాత్ర పోషించాలన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా,అవినీతికి తావు లేకుండా రాజకీయాలకు అతీతంగా పని చేయాలని ఎమ్మెల్యే హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముర్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్,రేమిడి శ్రీనివాస్ రెడ్డి,ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి,బుర్ర శ్రీధర్,ఇర్ఫాన్, కోంఢ్ర సురేష్,కొత్తకొండ శంకర్, సాయిరి దేవయ్య,గొల్లెన కొమురయ్య,తమిశెట్టి రాజేశ్,సతీష్ కుమార్ పాల్గొన్నారు.



# నారాయణ పాఠశాలలో వన మహోత్సవం

### విద్యార్థి దశ నుండే పర్యావరణ పరిరక్షణ అలవర్చుకోవాలి: ఏజిఎం చైతన్యరావు

కరీంనగర్,జూలై 04(వాయిస్ టుడే): పర్యావరణ పరిరక్షణ,పచ్చదనం పెంపొందించడం, మొక్కల సంరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో నగరంలోని నారాయణ పాఠశాలలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అంజయ్య హాజరై మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి సంవత్సరం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ఏజీఎం చైతన్య రావు మాట్లాడుతూపచ్చని పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. వన మహోత్సవం వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పర్యావరణంపై బాధ్యతాయుతమైన భావనను పెంపొంది స్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎం గోపాల్ రెడ్డ,పాఠశాల ప్రిన్సిపల్స్ పులి రమ్య,ఏవో సతీష్,శ్రీనివాస్, సుదర్శన్,ఉపాధ్యాయులు,సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.






## యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి - బంగారు భవిష్యత్తుని నిర్మించుకోవాలి

### ::: ఏ సి పి మాధవి, సి ఐ రామక్రిష్ణ గౌడ్

జమ్మికుంట జూలై 4 (వాయిస్ టుడే): యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని హుజురాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం విలసాగర్ గ్రామంలో యువతకు వివిధ సామాజిక అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువత డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దు అని హెచ్చరించారు. అలాగే ఇసుక అక్రమ రవాణా వంటి చట్టవ్యతిరేక పనులకు పాల్పడవద్దని, చట్టాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుతంగా నడుచుకోవాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించిన వారు, గ్రామ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం యువతతో కలిసి సమాజ హితం కోసం, వ్యసనాలకు దూరంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ (ప్లెడ్జ్) చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది , గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల కోసం బ్రతికిన వీరుడు స్వర్గీయ శ్రీ వంగవీటి మోహన రంగా

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ



కుత్బుల్లాపూర్ జూలై 4 (వాయిస్ టుడే ) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ సర్కిల్ ప్రగతి నగర్ లోని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ్యులు స్వర్గీయ శ్రీ వంగవీటి మోహన రంగా 79వ జయంతి సందర్భంగా వారి విగ్రహానికి ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంగవీటి రంగా సామాన్య ప్రజలతో నిలబడి, సమాజ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన ధైర్యవంతుడైన నాయకుడిగా స్మరించబడతారు అని తెలియజేశారు. న్యాయం పట్ల ఆయనకున్న నిబద్ధత, పేదల పట్ల ఆయనకున్న శ్రద్ధ, ఆయన నిర్భయ నాయకత్వం అసంఖ్యాక ప్రజల హృదయాలలో ఆయనకు ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించిపెట్టాయి అని గుర్తు చేశారు. ఆయన స్మృతికి మన హృదయపూర్వక నివాళులు అర్పిస్తూ, ప్రజా సేవ, ధైర్యం, ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధత అనే ఆయన ఆదర్శాల నుండి స్ఫూర్తిని పొందుదాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జంట నగరాల కాపు సంఘం అధ్యక్షులు మిరియాల రాఘవ రావు , మాజీ కార్పొరేటర్లు సుజాత, విజయలక్ష్మి, కమిటీ సభ్యులు లచ్చి బాబు, మల్లేశ్వరరావు, శ్రీధర్, బోనం నాయుడు, ప్రసాద్, రంజిత్, భాస్కరరావు, వెంకట్రావు, పవన్, చంటి, వెంకటేశ్వరరావు, సతీష్, భాను, నవీన్, పాల్గొన్నారు.

# దుండిగల్ సర్కిల్ పరిధిలో పారిశుధ్ధ్య పనులను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్




కుత్బుల్లాపూర్ జులై 4(వాయిస్ టుడే ) : దొమ్మర పోచంపల్లి పరిధిలో పారిశుధ్ధ్య నిర్వహణను మెరుగుపరచడం మరియు ప్రజల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే లక్ష్యంతో, డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరన్ క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షించారు.

**పర్యటనలో జరిగిన ముఖ్య అంశాలు**

డ్రైనేజీ సమస్య పరిష్కారం: దొమ్మర పోచంపల్లిలోని పిస్తా హౌస్ వెనుక భాగంలో డ్రైనేజీ పొంగిపొర్లుతున్న విషయాన్ని డిప్యూటీ కమిషనర్ స్వయంగా గుర్తించారు. దీనివల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే స్పందించిన ఆయన, సిబ్బందిని అప్రమత్తం చేసి సమస్యను పరిష్కరించారు.పార్కు సందర్శన: డాక్టర్ బస్తి వద్ద ఉన్న పార్కును పరిశీలించిన డిప్యూటీ కమిషనర్, పార్కు నిర్వహణ మరియు అభివృద్ధికి సంబంధించి స్థానిక అధికారులకు పలు కీలక సూచనలు జారీ చేశారు.వ్యర్థాల తొలగింపు:రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను పరిశీలించిన ఆయన, వెంటనే ఆ వ్యర్థాలను (గర్బజ్ ) తరలించి, పరిసరాలను శుభ్రం చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ ప్రక్రియ ఆయన పర్యవేక్షణలోనే పకడ్బందీగా పూర్తి చేయబడింది.

**పాల్గొన్న అధికారులు**

ఈ కార్యక్రమంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ అశోక్ కుమార్, అర్బన్ బయోడైవర్సిటీ మేనేజర్ రఘువీర్ రెడ్డి మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా బూత్ నెం. 527లో ఫారమ్‌ల పంపిణీ



కుత్బుల్లాపూర్ జులై 4(వాయిస్ టుడే ) భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ (ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమంలో భాగంగా బూత్ నెం. 527 పరిధిలో ఓటర్లకు ఫారమ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి బీజేపీ శక్తి కేంద్రం ఇంచార్జ్ వేముల రమేష్ నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీ నల్ల జై శంకర్ గౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ శ్రీ పులి బలరాం, బూత్ లెవల్ ఏజెంట్ శ్రీమతి భాగ్యలక్ష్మి, బీజేపీ సీనియర్ నాయకుడు మనీష్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఓటర్లందరూ ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అవసరమైన ఫారమ్‌లను సక్రమంగా నింపి, సంబంధిత పత్రాలతో పాటు గడువులోగా బూత్ లెవల్ అధికారికి (బి ఎల్ ఓ ) సమర్పించాలని కోరారు. కొత్త ఓటర్ల నమోదు, పేరు సవరణ, చిరునామా మార్పు లేదా ఇతర వివరాల సవరణ అవసరమైతే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి అర్హులైన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదై ఉండేలా చూసుకోవడం ప్రజాస్వామ్య బాధ్యత అని నాయకులు తెలిపారు.

# ప్రజా మనిషి స్వర్గీయ వంగవీటి మోహన రంగా జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నర్సారెడ్డి భూపతిరెడ్డి



కుత్బుల్లాపూర్ జులై 04(వాయిస్ టుడే ) : ప్రజా మనిషి స్వర్గీయ వంగవీటి మోహన రంగా జయంతి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి ఈ సందర్భంగా నర్సారెడ్డి భూపతిరెడ్డి మాట్లాడుతూ పేదలు, బలహీన వర్గాల పక్షాన నిలబడి, వారి అభ్యున్నతి కోసం తన చివరి శ్వాస వరకు పోరాడిన ప్రజానాయకుడు వంగవీటి మోహన రంగా అని తెలియచేసారు. ప్రజలతో మమేకమై, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం అని వారి సేవలను కొనియాడారు. అనంతరం నిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమం లో పాల్గొని పేదలకు దుప్పట్లు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి, ప్రగతినగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి, మిరియాల రాఘవరావు మరియు నిర్వాహక కమిటీ సభ్యులు బోనం వేణు గోపాల్ నాయుడు,ముద్రగల్ల రాఘవేంద్ర ప్రసాద్, కూనపరెడ్డి వెంకట్రావు, పంతం పవన్, పిండి చిన్న, పి వి మరియు వంగవీటి రంగా అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును మర్యాదపూర్వకంగా కలిసిన బొంగునూరి కిషోర్‌రెడ్డి



కుత్బుల్లాపూర్ జులై 04(వాయిస్ టుడే ) : మల్కాజిగిరి మాజీ శాసనసభ్యులు,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు ని రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి తో కలిసి వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిణామాలు,పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై పరస్పరం చర్చించారు. అనంతరం మైనంపల్లి హనుమంతరావు కి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు.



# కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి నాయకులు పాటుపడాలి

నాగారం, జూలై 4:-(వాయిస్ టుడే) : మేడ్చల్ మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్ రెడ్డిని, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ని మేడ్చల్, కిష్టాపూర్ పూడూర్ నూతన డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, రొయ్యపల్లి మల్లేష్ గౌడ్ లు శనివారం మర్యాద పూర్వకంగా కలిసారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సహకారంతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్ ఆధ్వర్యంలో విడుదలైన డివిజన్ అధ్యక్షుల నియామకంలో భాగంగా నూతనంగా ఎన్నికైన మేడ్చల్ కిష్టాపూర్ పూడూర్ డివిజన్ల అధ్యక్షులు వారిని మర్యాదపూర్వకంగా కలిసి నియామకంలో భాగంగా స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నూతనంగా నియమించబడ్డ అధ్యక్షులకు సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ 297 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు(చాపరాజు) ముదిరాజ్, 298 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు కౌడే మహేష్ కురుమ, వీరమల్ల శ్రావణ్ కుమార్ గుప్తా, బత్తుల మధుకర్ యాదవ్, మేడ్చల్ సొసైటీ డైరెక్టర్ వెంకట్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు తొంట యాదయ్య, దుర్గం వెంకటేష్ ముదిరాజ్, చెర్వుకొమ్ము శేఖర్ గౌడ్, ఉదండపురం సత్యనారాయణ, పెగుడ శ్యాంరావ్, సద్ది ప్రకాష్ రెడ్డి, పానుగంటి మహేష్ కుమార్, మేడ్చల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్ వంజరి, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రుద్రారం గ్రామంలో గంజాయి అమ్ముతున్న ఒక్క వ్యక్తిని పట్టుకున్న ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : నిందితుడు మధ్యప్రదేశ్ రాష్ట్రం రేవా జిల్లాకు చెందిన విజయ్ జైస్వాల్ (25) గ గుర్తింపు. నిందితుని వద్ద ఉన్న 1.855 కిలోల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీన పరుచుకొని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన ఎన్ఫోర్స్మెంట్ పోలీసులు. మధ్యప్రదేశ్ నుండి రైలు ప్రయాణం ద్వారా గంజాయిని హైదరాబాద్ తీసుకువచ్చి పటాన్ చెరు, ఇస్నాపూర్,రుద్రారంప్రాంతాల్లో 10 గ్రాముల చిన్న ప్యాకెట్లుగ చేసి విక్రయిస్తున్న నిందితుడు.



## దేశాభివృద్ధిలో మహిళలు కీలకం..సైబర్ క్రైమ్ ఎస్పీ: సాయిశ్రీ

హైదరాబాద్ : జూలై04;( వాయిస్టూడే) : విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవి ద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో విజన్ 2047 దిశగా భారత ప్రగతిలో నారీ శక్తి అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సైబర్ క్రైమ్ ఎస్పీ సాయిశ్రీ,, విజన్ 2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ హరిచరణ్ కలిసి సంయుక్తంగా ప్రారంభించారు. నేటి తరం యువతులు డిజిటల్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని ధైర్యంగా దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని డాక్టర్ హరిచరణ్ కోరారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ ఎస్పీ సాయిశ్రీ మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంతో మహిళల పాత్ర కీలకమని అన్నారు. యువతులు డిజిటల్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, విశ్వవిద్యాలయం డైరెక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ లోక పావని మరియు డాక్టర్ పుట్ట పాండు రంగయ్య, నల్లారి రాజేందర్, డాక్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థిని ప్రతిభకు “ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ సత్కారం

కుత్బుల్లాపూర్ జులై 4(వాయిస్ టుడే ) : ప్రతి సంవత్సరం ఐఐటిలో ప్రవేశాలకై నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో ఉత్తరాఖండ్లోని “ఐఐటి రూర్కిలో జియో టెక్నాలజీ” విభాగంలో సీటు సాధించిన కుత్బుల్లాపూర్ సత్యాన్ హై స్కూల్ పూర్వ విద్యార్థిని “ కె.అంజలీదేవి” స్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశం యాదవ్ ఆధ్వర్యంలో పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ.... నేటి సమాజంలో బాలురతో పోటీపడుతూ బాలికలు ఎన్నో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని నిదర్శనం విద్యార్థిని అంజలీదేవి అని, పేదరికంలో పుట్టి చదువు పట్ల ఆసక్తితో చిన్ననాటి నుంచి మంచి విద్యతో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ అంచలంచెలుగా ఎదుగుతున్న విద్యార్థిని అంజలీదేవి విద్యాభ్యాసానికి నా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని, పుట్టిన ఊరికి కన్న తల్లిదండ్రులకు మంచి పేరును తెస్తూ విద్యార్థిని అంజలి దేవి మరింత అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ చింతల మానస్, విద్యార్థిని చిన్నాన్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉషోదయ కాలనీలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవ మహోత్సవాల్లో పాల్గొన్న కోలన్ హన్మంత్‌రెడ్డి

### ఉషోదయ కాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా బ్రహ్మోత్సవ మహోత్సవాలు

కుత్బుల్లాపూర్ జులై 04(వాయిస్ టుడే ) గాజులరామారం పరిధిలోని ఉషోదయ కాలనీలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించిన బ్రహ్మోత్సవ మహోత్సవాల్లో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హనుమంత్ రెడ్డి భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి దివ్య ఆశీస్సులు పొందారు. అనంతరం కోలన్ హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ, స్వామి వారి కృపా కటాక్షాలు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, సుభిక్షం నెలకొనాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు.



# హైదరాబాద్‌లో మేవెన్ సిలికాన్ నైపుణ్య కేంద్రం ప్రారంభం

## తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి శిక్షణ, ఉపాధి అవకాశాలు



ఓయూ: దేశంలోని ప్రముఖ సూక్ష్మచిప్ రూపకల్పన, అంతర్నిర్మిత వ్యవస్థల శిక్షణ సంస్థ మేవెన్ సిలికాన్ హబ్సిగూడలో అత్యాధునిక నైపుణ్య కేంద్రాన్ని శనివారం ఘనంగా ప్రారంభించింది. బెంగళూరులో గత 17 సంవత్సరాలుగా వేలాది మంది ఇంజినీర్లకు శిక్షణ అందిస్తూ గుర్తింపు పొందిన సంస్థ తొలిసారిగా తెలంగాణలో కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సూక్ష్మచిప్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఈ కేంద్రం ఏర్పాటు కావడం శుభపరిణామమని అన్నారు. స్థానిక ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని సొంత రాష్ట్రంలోనే అభ్యసించి మెరుగైన ఉపాధి అవకాశాలు పొందేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందని పేర్కొన్నారు.తెలంగాణ నైపుణ్యాభివృద్ధి అకాడమీ ముఖ్య కార్యనిర్వాహక అధికారి కె. నితిన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బెంగళూరులో విజయవంతమైన ప్రయాణం అనంతరం హైదరాబాద్‌లో కేంద్రాన్ని ఏర్పాటు చేయడం రాష్ట్రంలో సూక్ష్మచిప్ రంగం అభివృద్ధికి నిదర్శనమని తెలిపారు. భారత సూక్ష్మచిప్ రంగంలో తెలంగాణ కీలక పాత్ర పోషించే సామర్థ్యం కలిగి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.మౌలాలి మాజీ కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ మాట్లాడుతూ సమాచార సాంకేతిక రంగంలో ఇప్పటికే దేశానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ, ఇప్పుడు సూక్ష్మచిప్ రంగంలోనూ అగ్రస్థానానికి చేరుకునేందుకు ఇటువంటి శిక్షణా సంస్థలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.సంస్థ వ్యవస్థాపకుడు శివకుమార్ పి.ఆర్. మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా తెలంగాణకు చెందిన వేలాది మంది విద్యార్థులు బెంగళూరులో శిక్షణ పొంది ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఇప్పుడు అదే నాణ్యమైన శిక్షణను హైదరాబాద్‌లో అందించడం తమకు సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ దేశంలోని కీలక సూక్ష్మచిప్ కేంద్రంగా ఎదుగుతున్న నేపథ్యంలో ఈ నైపుణ్య కేంద్రం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ తెలంగాణ యువ ఇంజినీర్లకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రపంచ స్థాయి శిక్షణ అందించడమే తమ లక్ష్యమన్నారు. ప్రభుత్వం, విద్యాసంస్థలు, పరిశ్రమలతో కలిసి రాష్ట్రంలో నైపుణ్యవంతమైన మానవ వనరులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మూడు ప్రముఖ ఇంజినీరింగ్ విద్యాసంస్థలతో పరస్పర అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. పరిశ్రమ--విద్యాసంస్థల అనుసంధానాన్ని బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఈ ఒప్పందాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. గత 17 సంవత్సరాల్లో మేవెన్ సిలికాన్ లక్షకు పైగా విద్యార్థులకు శిక్షణ అందించి, వేలాది మందిని ప్రముఖ సూక్ష్మచిప్ సంస్థల్లో ఉద్యోగాల్లోకి తీసుకెళ్లింది. హైదరాబాద్ కేంద్రంలో సూక్ష్మచిప్ రూపకల్పన, భౌతిక రూపకల్పన, రూపకల్పన ధ్రువీకరణ, అంతర్నిర్మిత వ్యవస్థల వంటి విభాగాల్లో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించనున్నట్లు సంస్థ వెల్లడించింది.



## దమ్మాయిగూడలో చెత్తసేకరణపై ఆటో సిబ్బందికి హెచ్చరిక

నాగారం, జూలై 4:-(వాయిస్ టుడే) : కీసర సర్కిల్ పరిధిలో ని దమ్మాయిగూడ వార్డ్ కార్యాలయంలో ఇంటింటికి చెత్త సేకరించే ఆటో సిబ్బందితో శనివారం డిప్యూటీ కమిషనర్ జి రాలింగం సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికి ప్రతిరోజూ వెళ్ళి చెత్త సేకరించాలని ఆయన ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్డబ్ల్యూఎం డిఈ సంతోష్, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.



## న్యూ ఇండియా పార్టీ తెలంగాణ ప్రధాన కార్యదర్శి గా పాశం మాధవ రావు

హైదరాబాద్ : జూలై 04;( వాయిస్ టూ డే) : న్యూ ఇండియా పార్టీ తెలంగాణ ప్రధాన కార్యదర్శి పాశం మాధవ రావు గా ఆ పార్టీ ఫౌండర్, ప్రెసిడెంట్ డా. జేవీ రాజు నియమించారు. ఈ మేరకు ఆయన నియామక పత్రాన్ని అందజేశారు. శనివారం హైదర్ గూడ లోని ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డా. జేవీ రాజు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా లబ్ది పొందాలని న్యూ ఇండియా పార్టీ లక్ష్యమన్నారు. ఆకలి చావులు, ఆత్మహత్యలు, దోపిడీలు, అవినీతి అరాచకాలు లేని రాజ్యాన్ని స్థాపించడమే న్యూ ఇండియా పార్టీ ధ్యేయమని ఆయన అన్నారు. పేదలకు ఉపాధి స్వంత గూడు లేక సరైన విద్యా వైద్యం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో సామాన్యులు బతకలేని పరిస్థితులు దాపురించే ప్రమాదం పొంచి ఉందని... దీనికి పాలకులు కారణమని పేర్కొన్నారు. పాలకులు చిన్న, చిన్న తాయిలాల లాంటి పథకాలతో వారిని మభ్యపెడుతూ వారి ఓట్లను కొల్లగొడుతూ గెలిచాక.. అందిన కాడికి దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మోసం ప్రసాద్, పట్నం ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఫతేనగర్‌లో 'హర్ మా కె నామ్ పే ఏక్ పెడ్' కార్యక్రమం నిర్వహించిన బీజేపీ నాయకులు

కూకట్ పల్లి : జులై 4(వాయిస్ టుడే) : బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్, బీజేపీ మైనారిటీ మోర్చా నాయకులు నాసిర్ ఆధ్వర్యంలో ఫతేనగర్‌లో 'హర్ మా కె నామ్ పే ఏక్ పెడ్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జగన్‌మోహన్ సింగ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షాజహాన్ పాల్గొని ఫతేనగర్‌లోని అరబ్ షా బాబా దర్గాను సందర్శించారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన 'హర్ మా కె నామ్ పే ఏక్ పెడ్' కార్యక్రమంలో భాగంగా ఫతేనగర్ మసీదు సమీపంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మైనారిటీ మోర్చా కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు తెలిపారు.

## వరంగల్‌లో వైభవంగా శ్రీవాణి--అభినవ్ రెడ్డి వివాహ వేడుక

# వధూవరులకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆశీస్సులు



వరంగల్, జూలై 4 (వాయిస్ టుడే న్యూస్): ప్రముఖ వ్యాపారవేత్త కూసం శ్రీనివాసులు కుమార్తె శ్రీవాణి వివా హం, హైదరాబాద్‌కు చెందిన శీలం కన్నారెడ్డి--నిర్మలలి దంపతుల కుమారుడు అభినవ్ రెడ్డి తో శనివారం ఉద యం వరంగల్ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు ఆయన పెద్దన్న వద్దిరాజు కిషన్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తమ రావు, సంఘం ప్రముఖులు మెట్టు శ్రీనివాస్, రమేష్ హాజారితదితరులు పాల్గొన్నారు. వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించిన ప్రముఖులు, వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. అలాగే వధూవరుల తల్లిదండ్రులు కూసం శ్రీనివాసులు కుటుంబానికి శీలం కన్నారెడ్డి--నిర్మల కుటుంబానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



## నాగన్నకు నివాళులర్పించిన డాక్టర్ కె వి కృష్ణారావు బృందం

ఖమ్మం , జూలై 4 ( వాయిస్ టుడే) : తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి డా కె వి కృష్ణారావు అరుణోదయ... నాగన్న పార్థిక దేహాన్నికి పూలమాలతో ఘనంగా ని వాళులర్పించారు . ప్రజా సాంస్కృతిక ఉద్యమం పట్ల ఆయనకున్న నిబద్ధత చాలా గొప్పదని ఆయన మరణం బహుజనులకు తీరని లోటని పేద కుటుంబంలో జన్మించి ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొన్న మహనీయుడని ఆయన జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం ఆ యన ఆటపాటలతో సమాజాన్ని మేల్కొల్పి పేదవాడి గుండెలో వెలుగై నిలిచారని అన్నారు . పగడాల నరేందర్ , బొబ్బిలి భరత్ చంద్ర , బానోతు భద్రు నాయక్ , అనిల్ కుమార్ నాయక్ పాల్గొన్నారు.

## లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో.. టేబుల్‌టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం



హైదరాబాద్, జూలై 04: 4వ లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ తెలంగాణ రాష్ట్ర ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ -- 2026 శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారుల పాల్గొనడంతో టోర్నమెంట్‌కు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి బ్రహ్మణి నారా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని ఆమె పేర్కొన్నారు. ప్రత్యేక అతిథిగా మాజీ జాతీయ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్, క్రికెట్ దిగ్గజం అనిల్ కుంబ్లేతో కలిసి టెన్విక్ స్పోర్ట్స్ ను సహ -స్థాపించిన వసంత్ భరద్వాజ్ పాల్గొన్నారు. యువ క్రీడాకారులు లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ స్కూల్, ఉప్పల్ ప్రిన్సిపాల్ డా. బ్రదర్ జోసెఫ్ పసాలా, లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ ప్రిన్సిపాల్ రెవ. బ్రదర్ ఆంథోనీ పాల్గొని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తెలంగాణ స్టేట్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు కె. కె. మహేశ్వరి, గౌరవ కార్యదర్శి పి. నాగేందర్ రెడ్డి, సలహాదారు ప్రకాష్ రాజు, లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ టేబుల్ టెన్నిస్ జట్టు మెంటర్ ఎం. దీపేష్ సింగ్ తదితర ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ టోర్నమెంట్ ద్వారా యువ క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్ ప్రతిభ, పట్టుదల, క్రీడాస్ఫూర్తి, నిష్పాక్షిక పోటీకి ప్రతీకగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. టోర్నమెంట్ నిర్వహణలో ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.టి. అజిత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అవసరమైతే దీనిని మరింత సంక్షిప్తంగా లేదా పత్రికల ప్రధాన వార్త శైలిలో ఆకర్షణీయమైన శీర్షికతో కూడా సిద్ధం చేయగలను.

## ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా 79వ జయంతి వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్



కూకట్ పల్లి : జులై 4(వాయిస్ టుడే) : కూకట్ పల్లి లో ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా 79వ జయంతి సందర్భంగా శనివారం కేపీహెచ్‌బీ టెంపుల్ బస్ స్టాప్ వద్ద ఘనంగా నిర్వహించిన జయంతి వేడుకలకు తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మోహనరంగా ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు. సమాజ సేవ, ధైర్యసాహసాలు, ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏఎంసీ చైర్మన్ పుష్ప రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, నాయకులు గంధం రాజు, రంగమోహన్, కరుణాకర్, భరత్, అరవింద్ రెడ్డి, కిలారు శ్రీనివాస్ బాబు, రాజేష్ గౌడ్, నళినీకాంత్, బాలరాజు, రాము, నవీన్, కామినేని వాసు, వనజ, సుజాత, వాణి, అరుణ్తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని వంగవీటి మోహనరంగా గారికి ఘన నివాళులు అర్పించారు.



## ఘనంగా దొడ్డికొమురయ్య కురుమ 80 వ వర్ధంతి వేడుకలు

మేడిపల్లి/సికింద్రాబాద్, జూలై 03 (వాయిస్ టుడే ప్రతినిధి): దొడ్డి కొమురయ్య కురుమ 80 వ వర్ధంతి సందర్భంగా మేడిపల్లి మండల కే వై సి ఎస్ అధ్యక్షులు మరాఠీ శివెందర్ కురుమ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కురుమ యువ చైతన్య సమితి రాష్ట గౌరవ అధ్యక్షులు గొరిగే నర్సింహా కురుమ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య కురుమ విగ్రహం ట్యాంక్ బండ్ పైన ఏర్పాటు చెయ్యాలని, జనగామ జిల్లాకు దొడ్డి కొమురయ్య కురుమ పేరు పెట్టాలనీ, వారి జీవిత చరిత్ర పాఠ్య పుస్తకాలలో చేర్చాలి అని డిమాండ్ చేశారు. సంఘం సభ్యులు, సత్యనారాయణ సోమేశ్ విజయ్ శివశంకర్ సిద్ధులు,సోమయ్య,రాజు ,రవి, అమర్ వినయ్, కుమార్, నర్సింహా, రవీందర్ పాల్గొన్నారు.

## ఐనవోలు కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా

# నకరకంటి మోహన్‌గౌడ్ నియామకం

### వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన నకరకంటి మోహన్ గౌడ్



హనుమకొండ, జూలై 4: కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా హనుమకొండ జిల్లా డీసీసీ పరిధిలో కొత్త మండల, డివిజన్ అధ్యక్షుల నియామకాలను ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర టి-పీసీసీ కమిటీ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఐనవోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నకరకంటి మోహన్ గౌడ్‌ను నియమించింది. నియామక వార్త వెలువడిన అనంతరం జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నకరకంటి మోహన్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ.. సన్మానించారు. మోహన్ గౌడ్ నివాసానికి చేరుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నకరకంటి మోహన్ గౌడ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డితో పాటు తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. పార్టీని మండల స్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తల సమన్వయానికి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని నకరకంటి మోహన్ గౌడ్ పేర్కొన్నారు.



## స్వర్గీయ వంగవీటి మోహన్ రంగా 79వ జయంతికి ఘన నివాళులు అర్పించిన ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

కూకట్ పల్లి : జులై 4(వాయిస్ టుడే) : స్వర్గీయ వంగవీటి మోహన్ రంగా 79వ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి కాపు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కేపీహెచ్‌బీ కాలనీ హౌసింగ్ బోర్డ్ టెంపుల్ బస్‌స్టాప్ సమీపంలో ఘనంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ హాజరై, వంగవీటి మోహన్ రంగా విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు ఆహారాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ, వంగవీటి మోహన్ రంగా ప్రజాసేవకు అంకితమైన నాయకుడిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వంగవీటి మోహన్ రంగా అభిమానులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కాపు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.